V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక


# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
02-08-2024

సంపుటి : 01 । సంచిక : 90 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## ఉప వర్గీకరణకు
# లైన్ క్లియర్

**ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కీలక తీర్పు**



వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్రాలకు అధికారం ఉంది

ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో ఆరుగురు అనుకూలం

విభేదించిన జస్టిస్ బేలా త్రివేది

**దిల్లీ:** సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం కీలక తీర్పును ఇచ్చింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వాలకు అధికారం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం రిజర్వేషన్ కోటాను రాష్ట్రాలు విభజించవచ్చని గురువారం కీలక తీర్పునిచ్చింది. ఉపవర్గీకరణకు సంబంధించి 2004లో సుప్రీంకోర్టు 'ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్' కేసులో ఇచ్చిన తీర్పు చెల్లదని తేల్చిచెప్పింది. అయితే, ఉపవర్గీకరణ చేపట్టే రాష్ట్రాలు- అందుకు సహేతుక కారణాలు చూపాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనంలో జస్టిస్ బేలా త్రివేది మాత్రమే విభేదించగా మిగిలిన ఆరుగురు ఉపవర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. మిగతా2లో...



## సుప్రీం తీర్పునకు అనుగుణంగా వర్గీకరణ

- అమలులో ఉన్న నోటిఫికేషన్లకూ వర్తింపు
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన


2

## 30ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం

- వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దు
- ఆ రోజు చంద్రబాబు తీసుకొచ్చిన చట్టం వల్లే వర్గీకరణ
- చొరవచూపిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు
- దిల్లీలో మీడియాతో మందకృష్ణ మాదిగ



2



## ఏబీసీడీ వర్గీకరణ తీసుకొచ్చింది నేనే

సుప్రీంకోర్టు తీర్పు స్వాగతిస్తున్నాం సామాజిక న్యాయమే

తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం: చంద్రబాబు

2

నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీకి
## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహిళలపై అత్యంత అవమానకరంగా ప్రవర్తించారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గురువారం వారు అసెంబ్లీకి నల్లబ్యాడ్జీలతో హాజరై నిరసన తెలిపారు.



2

మహేశ్ బ్యాంక్ ఛైర్మన్, ఎండీ ఇళ్లలో
## ఈడీ సోదాలు

- నగదు, డాక్యుమెంట్లు స్వాధీనం
- అనర్హులకు రూ.300 కోట్లకు పైగా రుణాలు ఇచ్చినట్లు గుర్తింపు




3

## సోనియా గాంధీ కోరిక మేరకే ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరా

- పదవుల కోసం కాదు : హరీశ్ రావు



2



## నాలుగో నగరాన్ని
# నిర్మిస్తాం

**బెగరికంచను న్యూయార్క్ కంటే మిన్నగా మారుస్తాం**

- విదేశాలనుంచి రూ.వేల కొట్ల పెట్టుబడులు తెస్తాం
- స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో రేవంత్

**విశ్వంభర, హైదరాబాద్:** గత పాలకులు హైదరాబాద్, సికింద్రాబాద్ , సైబరాబాద్ నగరాలు నిర్మించగా తమ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలోని బెగరికంచను నాలుగో సిటీగా నిర్మించనుందని మిగతా2లో...

## త్వరలో తెల్ల రేషన్
# కార్డుల జారీ



**విధివిధానాలకు కేబినెట్ సబ్ కమిటీ**

- నేడే జాబ్ క్యాలెండర్ ప్రకటన
- నిఖత్ జరీన్, సిరాజ్‌లకు ఇళ్ల స్థలాలు
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీ ఖాన్ నియామకంపై మళ్లీ ప్రతిపాదనలు



**విశ్వంభర, హైదరాబాద్:**


అసెంబ్లీలో శుక్రవారం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. యువతకు హామీ ఇచ్చిన ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. అలాగే త్వరలో ప్రజలకు తెల్ల రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. పేదలకు తెల్లరేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు ఇస్తామని చెప్పారు. రేషన్ కార్డుల జారీ విధివిధానాల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను తప్ప కుండా నెరవేరుస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మంత్రివర్గ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్రీడాకారులు ఈషాసింగ్, నిఖత్ జరీన్, సిరాజ్‌కు 600 గజాలు చొప్పున ఇంటి స్థలం ఇవ్వాల ని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. విధుల్లో చనిపోయిన రాజీవ్ రతన్ కుమారుడికి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం మిగతా3లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 94 | ₹ 116 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 168 | ₹ 191 |



9

## గ్రామ సర్పంచ్ కొడుకుకు
# ఒలింపిక్ మెడల్

- విశ్వక్రీడల్లో భారత్‌కు మరో పతకం
- కాంస్య పతకం సాధించిన యువ షూటర్ కుశాల్..

# ఈ పరిస్థితి చూసి వేదనను అనుభవిస్తున్నా

నాతండ్రి మరణించిన సమయం గుర్తొస్తోంది

ఇక్కడి ప్రజలు తమ కుటుంబాల్నే కోల్పోయారు

రాహుల్ గాంధీ భావోద్వేగం



**విశ్వంభర, వయనాడ్:**

వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధిత కుటుంబాలను, బాధితులను పరామర్శించిన అనంతరం కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. గురువారం ఇక్కడి పరిస్థితి చూస్తుంటే తన తండ్రి మరణించిన సమయంలో తాను పడిన వేదనను అనుభవిస్తున్నానని అన్నారు. ఇక్కడి ప్రజలు కేవలం వారి తండ్రినే కాదు మొత్తం కుటుంబాన్నే మిగతా2లో...

## సోనియా గాంధీ కోరిక మేరకే ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరా

**విశ్వంభర , హైదరాబాద్:** తనకు ఎవరి భిక్ష వల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి పదవి రాలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ్యుడు హరీశ్ రావు అన్నారు. సోనియా గాంధీ కోరిక మేరకే ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరామని, పదవుల కోసం కాదని ఎక్స్ వేదిక గా పేర్కొన్నారు. తనకు మంత్రిపదవి వచ్చినపుడు ఊరేగింపులో రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారని హరీశ్ రావు గుర్తు చేశారు. 2005 జులై నాలుగో తేదీన మంత్రి పదవులకు రాజీనామా చేసిన సమయంలో మీడియాతో మాట్లాడిన వీడియోలను జతపరిచారు. పదవులు, విలువల గురించి మాట్లాడే హక్కు రేవంత్ రెడ్డికి ఎక్కడిదని ప్రశ్నించిన ఆయన తెలంగాణ ఉద్యమంలో పదవులను గడ్డి పోచలుగా త్యజించిన చరిత్ర తమదని అన్నారు. పూటకో పార్టీ మారిన రాజకీయ చరిత్ర, పదవుల కోసం పెదవులు మూసుకున్న చరిత్ర రేవంత్ రెడ్డిది అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అయినప్పటికీ హుందాగా ప్రవర్తించడం లేదని ఆక్షేపించారు. చీఫ్ మినిస్టర్‌గా కాకుండా, చిల్లరగా మాట్లాడే చీప్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

## నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీకి భారాస ఎమ్మెల్యేలు..

**విశ్వంభర, హైదరాబాద్:** శాసనసభలో సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహిళలపై అత్యంత అవమానకరంగా ప్రవర్తించారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గురువారం వారు అసెంబ్లీకి నల్లబ్యాడ్జీలతో హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం, డిప్యూటీ సీఎం ప్రవర్తన తమను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. వెంటనే తమ సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులని.. ఎంతో హుందాగా ప్రజలకు సేవ చేసే గుణం వారిదని తెలిపారు. అలాంటి మహిళా నేతలపై ఇంత చులకనగా మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసిన ఈ వ్యాఖ్యలు వారిద్దరిపై మాత్రమే కాదని.. మొత్తం మహిళలపై వారికున్న చులకన భావాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. కచ్చితంగా మహిళలంతా కాంగ్రెస్ నేతల వ్యవహార శైలిని గమనిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. మరోవైపు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నలుపు రంగు కోటు ధరించి సభకు హాజరు కావడంపై భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమకు మద్దతుగా నల్ల దుస్తులు ధరించి వచ్చారని పేర్కొంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

## సుప్రీం తీర్పునకు అనుగుణంగా వర్గీకరణ

**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్.సి. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ చేసేందుకు తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. ఇప్పుడు అమలులో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లలో కూడా మాదిగ, మాల ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకోసం అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎస్.సి. వర్గీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు మాదిగ, మాల ఉప కులాలకు వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే గత ప్రభుత్వం సంపత్ కుమార్‌ను సస్పెండ్ చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2023 డిసెంబరు 23న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, దామోదర రాజనర్సింహ అడ్వకేట్ జనరల్‌ను సుప్రీంకోర్టుకు పంపించారన్నారు.

## ఏబీసీడీ వర్గీకరణ తీసుకొచ్చింది నేనే

**విశ్వంభర, అమరావతి:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఏడుగురు సభ్యులుగా జడ్జిల్లో ఆరుగురు సభ్యులు ఏకగ్రీవంగా అభిప్రాయం చెప్పడం అభినందనీయమని అన్నారు. నంద్యాల జిల్లా సున్నిపెంటలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు.సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని, అందరికి న్యాయం జరుగాలనే లక్ష్యంతో 1996-97లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రామచంద్రారావు కమిషన్ వేసి ఆర్థిక పరిస్థితులు అధ్యయనం చేసిన తరువాత ఏబీసీడీ వర్గీకరణను తీసుకొచ్చానని తెలిపారు.జనాభా దామాషా ప్రకారం అన్ని కులాలకు, ప్రతి మతం, వర్గాలకు న్యాయం చేయడం టీడీపీ సిద్ధాంతమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలు, మంత్రి వర్గ కూర్పులో సామాజిక న్యాయాన్ని అమలు చేశామని వివరించారు.

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు. దశాబ్దాలుగా వెనకకు నెట్టివేయబడ్డ ఎన్నో పేద కులాలకు ఈ చరిత్రాత్మక తీర్పు వల్ల ఇప్పుడైనా కొంత న్యాయం జరుగుతుందని ఆశిద్దాం అని ఆయన పేర్కొన్నారు.అయితే ప్రభుత్వ రంగంలో అవకాశాలు సన్నగిల్లుతున్న ఈ తరుణంలో ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లను ప్రవేశపెడితేనే పేద వర్గాల సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దక్షిణ భారత దేశంలో ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో ఈ విషయాన్ని తెరమీదికి తీసుకొచ్చి మూడు దశాబ్దాల పోరాటాన్ని నిర్మించిన కృష్ణ మాదిగకు, మిగతా ఉద్యమకారులందరికీ, ఈ అంశాన్ని సమర్థించిన అన్ని రాజకీయ పార్టీలకు అభినందనలు తెలుపుతున్నట్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## ఇది చారిత్రాత్మక తీర్పు

### ఎర్రోళ్ల శ్రీనివాస్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును స్వాగతిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. సుదీర్ఘ సమస్యకు నేడు పరిష్కారం లభించింది. ఎన్నో ఏండ్ల పోరాటానికి ఫలితం లభించింది. ఎన్నో త్యాగాలకు గౌరవం దక్కింది. దశాబ్దాల కల నెరవేరింది. దళితులందరికీ ఇది పండుగ రోజు. ఇంటింటా సంబురాలు జరుపుకొనే రోజు. ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యమం నుంచే బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నది. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఆనాడే ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి అసెంబ్లీ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపించారు. అదే తీర్మానం కాపీతో దళిత నాయకులను ఢిల్లీకి వెంట తీసుకెళ్లి ప్రధాని మోదీకి కలిసి వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత, వచ్చే ప్రభుత్వ నోటిఫికేషన్లలో, విద్య, ఉద్యోగ అవకాశాల్లో యువతకు అవకాశం కల్పించాలి' అని గురువారం ఒక ప్రకటనలో కోరారు.

# నాలుగో నగరాన్ని నిర్మిస్తాం



(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నాలుగేళ్లలో ఈ ప్రాంతాన్ని న్యూయార్క్ కంటే అద్భుత నగరంగా నిర్మిస్తామన్నారు. విదేశాల నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చి ఈ ప్రాంతాన్ని హెల్త్, స్పోర్ట్స్, ఇతర కంపెనీలకు హబ్‌గా మారు స్తామని వి వరించారు. బంజారాహిల్స్ లో ఉండే వారి మాదిరిగా ఈ ప్రాంత ప్రజలు గొ ప్పగా చెప్పుకునేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు.57 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీని రాష్ట్ర ప్రభుత్వం నిర్మిం చనుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వా మ్యంతో నిర్మాణం జరగనుంది. దీంతో పాటు మరో నాలుగు సెంటర్లకు సీఎం శంకుస్థాపన చేశారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ప్రైమరీ హెల్త్ సెంటర్ , మోడ్రన్ స్కూల్, కమ్యూనిటీ సెంటర్లకు శంకుస్థాపన చేశారు . ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. ఈ ప్రాంతాన్ని హెల్త్, స్పోర్ట్స్, ఇతర కంపెనీలకు హబ్‌గా మారుస్తామని వివరించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగం కల్పించే బాధ్యత తీసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతానికి మెట్రో రైలు కూడా నిర్మించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ యూనివర్సిటీ కోసం 57 ఎకరాల స్థలం కేటాయించామని, రూ. 150 కోట్లతో వర్సిటీ నిర్మిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఇక్కడ అడ్మిషన్లు ప్రారంభిస్తామన్నారు.

**మహాత్మాగాంధీ స్ఫూర్తితో**

అంతకుముందు తెలంగాణ అసెంబ్లీలో స్కిల్ వర్సిటీ బిల్లుపై చర్చ జరిగింది. మహాత్మాగాంధీ స్ఫూర్తితో.. తెలంగాణలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రస్తుత కాలానికి తగినట్లు యువతలో నైపుణ్యాలు పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు . స్కిల్ యూనివర్సిటీతో పాటు మరో నాలుగు ప్రధాన కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు ఎన్నో సం స్థలు ముందుకు వచ్చాయని వివరించారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్టుతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని గుర్తు చేశారు. ఓఆర్ఆర్, విమానాశ్రయంతో రంగారెడ్డి జిల్లా భూముల విలువలు పెరిగాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**నైపుణ్యం ఉన్నవారి కొరత ఉంది..**

దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇచ్చి ప్రోత్సహించారని వివరించారు. దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ దేశానికి సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చారని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌లో ఐటీ రంగ అభివృద్ధికి ఆనాడు రాజీవ్ గాంధీ పునాదులు వేశారని గుర్తుచేశారు. ప్రపంచంలో మార్పులకు అనుగుణంగా మన విధానాల్లో కూడా ఆ మార్పులు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**17 కోర్సులను ప్రవేశపెట్టబోతున్నాం**

. లక్షలాదిమంది యువతకు ఉపాధి కల్పించడమే స్కిల్స్ యూనివర్సిటీ ఉద్దేశం. స్కిల్స్ యూనివర్సిటీపై ప్రధాన ప్రతిపక్ష నాయకులు సూచనలు ఇస్తే సంతోషించేవాళ్లం. కానీ వారు సభకు రాలేదు.. వచ్చిన వారు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. స్కిల్స్ యూనివర్సిటీలో 17 కోర్సులను ప్రవేశపెట్టబోతున్నాం. స్కిల్స్ యూనివర్సిటీలో కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్స్ అందించాలని నిర్ణయం తీసుకున్నాం. ఏడాదికి రూ.50వేలు నామమాత్రపు ఫీజుతో కోర్సుల శిక్షణ అందించనున్నాం. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉచితంగా అందిస్తాం.ఈ సంవత్సరం 6కోర్సులకు రెండువేల మందికి అడ్మిషన్లకు అవకాశం ఇస్తున్నాం. శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చేందుకు కొన్ని సంస్థలు ముందుకు వచ్చాయి. భవిష్యత్‌లో జిల్లాల్లోనూ కళాశాలలు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చే ఆలోచన చేస్తున్నాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఉపాధితో పాటు ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు: మంత్రి శ్రీధర్‌బాబు**

తెలంగాణ నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తుంని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. స్కిల్ యూనివర్శిటీ కోసం శాశ్వత క్యాంపస్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. యువతకు ఉపాధితో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. అందరి సలహాలు, సూచనలు తీసుకున్నామన్నారు. అందరికి మేలు జరిగేలా స్కిల్ యూనివర్సిటీ ఉంటుందని వివరించారు. కొంతమంది వ్యక్తుల కోసమే ప్రైవేటు యూనివర్సిటీలను తీసుకువచ్చారని విమర్శించారు.

# 30 ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం

**ఢిల్లీ:** ముప్పయ్యేళ్ల తమ పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హర్షం వ్యక్తం చేశారు.ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని 2004లోనే చెప్పానన్నారు. అధర్మం తాత్కాలికమైనని వెల్లడించారు. వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకే ఉందని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా పోరాటం చేస్తోందని.. ఎంతో మంది నేతలు ప్రాణాలు కోల్పోయారన్నారు. జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు పోరాడామని వివరించారు. ఉద్యమాలను దెబ్బతీసే కుట్రలు ఎన్నో జరిగాయని విమర్శించారు. అయినా సహనం కోల్పోకుండా పట్టుదలతో పోరాటం చేసి విజయం సాధించామని తెలిపారు.ఢిల్లీలో గురువారం మందకృష్ణ మాదిగ మీడియాతో మాట్లాడారు.

**1994 వర్గీకరణ ఉద్యమాన్ని ప్రారంభించాం..**

1994లో ప్రకాశం జిల్లా ఈదుమూడిలో వర్గీకరణ ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు పోరాడామన్నారు. న్యాయం కోసం ఎమ్మార్పీఎస్‌కు అండగా నిలిచిన వారందరికీ ఈ విజయం అంకితం ఇస్తున్నామన్నారు. ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు కూడా సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణకు జనాభా లెక్కలతో పనిలేదని చెప్పారు. వర్గీకరణ కోసం ప్రధాని మోదీ చొరవ తీసుకున్నారని చెప్పారు. అనుకూల తీర్పునిచ్చిన జడ్జిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలో విజయోత్సవ సభ నిర్వహిస్తామని, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతామన్నారు.

**సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు**

"ఉద్యమంలో ప్రాణాలర్పించిన ఎమ్మార్పీఎస్ నేతలకు ఈ విజయం అంకితం చేస్తున్నాం. ప్రక్రియ వేగవంతానికి చొరవ తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ఉమ్మడి ఏపీలో ఎస్సీ వర్గీకరణ చేసింది సీఎం చంద్రబాబే. ప్రస్తుతం అనుకూల తీర్పు వచ్చిన సందర్భంలోనూ సీఎంగా ఉన్నది ఆయనే. ఆయన వర్గీకరణ చేయకపోతే వేలాది ఉద్యోగాలు వచ్చేవి కావు. న్యాయం బతికిందంటే ఆరోజు చంద్రబాబు తీసుకొచ్చిన చట్టం వల్లే. వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని పభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నా" అని మందకృష్ణ మాదిగ తెలిపారు.

## ఈ పరిస్థితి చూసి వేదనను అనుభవిస్తున్నా

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరి పట్ల మనం సానుభూతి చూపాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇవాళ యావత్ దేశం వయనాడ్ పై దృష్టి సారించిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇక ప్రియాంక గాంధీ మాట్లాడుతూ తాము బాధితులను కలిసి వారితో రోజంతా గడిపామని, ఇది మాటలకు అందని మహా విషాదమని చెప్పారు. ప్రజల బాధలను చూసి చలించిపోయామని, ఇక్కడి పరిస్థితి చూస్తుంటే వారెంతగా నలిగిపోయారో మనం ఊహించవచ్చని వ్యాఖ్యానించారు. బాధితులకు భరోసా, ధైర్యాన్ని ఇచ్చేందుకే తాము ఇక్కడకు వచ్చామని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోనూ విపత్తు సంభవించిందని అన్నారు. ఈ ప్రమాదంలో ఆప్తులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను ఎలా ఆదుకోవాలనే దానిపై తాము శుక్రవారం కూలంకషంగా చర్చిస్తామని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఇక కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య 288కి చేరుకుంది. అయితే ప్రమాదానికి కేంద్ర స్థానమైన చూర్‌మలాలో అంతకుముందు గురువారం మధ్యాహ్నం రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. మెప్పాడిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బాధితులను కలుసుకున్నారు.

# ఉప వర్గీకరణకు లైన్ క్లియర్

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్ల అంశంలో పంజాబ్ ప్రభుత్వం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఎమ్మార్పీఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రభుత్వాలు మార్గదర్శకాలను రూపొందించుకోవాలని సుప్రీం కోర్టు సూచించింది.ఈ తీర్పుపై స్పందిస్తూ 20 ఏండ్ల పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు.

**విస్తృతంగా విచారించిన ధర్మాసనం..**

విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉంటుందా? లేదా? అనే అంశంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విస్తృతంగా విచారించింది. రాష్ట్రాలకు అధికారం ఉండదని, పార్లమెంట్‌కు మాత్రమే ఎస్సీ, ఎస్టీ కోటా రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ చేయగలదని పేర్కొంటూ 2004లో ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ చెల్లదంటూ పంజాబ్, హరియాణా హైకోర్టు 2010లో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పంజాబ్ సర్కారు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే, ఇదే అంశంపై మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి.ఉమ్మడి ఏపీ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2004లో వెలువరించిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ ప్రభుత్వ ఎస్సీ కోటా రిజర్వేషన్ల ఉపవర్గీకరణ ఉందని పంజాబ్, హరియాణా హైకోర్టు 2010లో వెలువరించిన ఉత్తర్వులో అభిప్రాయం వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఉపవర్గీకరణ రాజ్యాంగ అధికరణం 14(సమానత్వ హక్కు)కు భంగం కలిగించేలా ఉందని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈవీ చిన్నయ్య కేసులో పేర్కొంది.షెడ్యూల్డ్ కులాల జాబితాలోకి ఏదైనా సామాజిక వర్గాన్ని చేర్చాలనుకున్నా.. తొలగించాలనుకున్నా పార్లమెంట్‌కు మాత్రమే మాత్రమే అధికారం ఉంటుందని, రాష్ట్రాలకు కాదంటూ 2004 తీర్పులో స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పును పంజాబ్‌కు వర్తించదంటూ ప్రభుత్వం పేర్కొంది. హైకోర్టు తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టులోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. విస్తృత ధర్మాసనానికి ఈ వివాదాన్ని బదిలీ చేయాలని 2020లో సిఫార్సు చేసింది. ఇటీవల మళ్లీ కేసు విచారణకు వచ్చింది. ఈ క్రమంలో రాజ్యాంగ ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పును పక్కనపెడుతూ రాష్ట్రాలకు అధికారం ఉంటుందంటూ తీర్పును వెలువరించింది.

**ఒక కేసు- ఆరు తీర్పులు**

జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనంలో జస్టిస్ బీఆర్ గవై, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీశ్ చంద్ర సభ్యులుగా ఉన్నారు. వీరు ఈ కేసులో 6 తీర్పులను విడివిడిగా ఇచ్చారు. ఉపవర్గీకరణకు అనుకూలంగా జస్టిస్ మిశ్రాకు, తనకు కలిపి సీజేఐ ఒక తీర్పు రాశారు. మిగిలిన నలుగురు ఇదే వైఖరితో నాలుగు తీర్పులు విడివిడిగా ఇచ్చారు. వీరిలో ఒకరైన జస్టిస్ బీఆర్ గవాయి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీలేయర్‌ను గుర్తించి, వారిని రిజర్వేషన్ పరిధి నుంచి తప్పించాలని సూచించారు. జస్టిస్ బేలా త్రివేది మాత్రం ఉపవర్గీకరణకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. మెజారిటీ తీర్పుతో తాను విభేదిస్తున్నానని, రాజ్యాంగంలోని 341వ అధికరణ కింద నోటిఫై చేసిన ఎస్సీ జాబితాను మార్చే అధికారం రాష్ట్రాలకు లేదని ఆమె అభిప్రాయపడ్డారు.

**కేంద్రం వాదన ఇదీ!**

ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గీకరణ ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడింది. అప్పుడే ప్రభుత్వాలు సరైన పథకాలు రూపొందించగల వని తెలిపింది. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న కల ఉపవర్గీకరణ ద్వారా సాకారం అవుతుందని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు తీసుకురావడం వెనుకున్న లక్ష్యం చేరుకోవాలంటే కోటా హేతుబద్ధీకరణ చాలా ముఖ్యమని వివరించారు.

**ఎస్సీల్లో క్రిమీలేయర్‌ను గుర్తించే విధానాన్ని రూపొందించాలి: జస్టిస్ గవాయి**

ఎస్సీ, ఎస్టీల వర్గీకరణకు సుప్రీం ధర్మాసనం రూట్ క్లియర్ చేసింది. రాష్ట్రాలకు ఆ కోటాను వాడుకోవచ్చు అని కోర్టు పేర్కొన్నది. అయితే ఏడుగురు సభ్యుల ధర్మాసనంలో ఉన్న జస్టిస్ బీఆర్ గవాయి.. తీర్పులో కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఉన్న క్రిమిలేయర్‌ను గుర్తించేందుకు ప్రభుత్వం ఓ విధానాన్ని రూపొందించాలని జస్టిస్ గవాయి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.జస్టిస్ బీఆర్ గవాయి దళిత వర్గానికి చెందిన వ్యక్తి. వచ్చే ఏడాది ఆయన సుప్రీంకోర్టు సీజేగా మారే అవకాశాలు ఉన్నాయి. కేజీ బాలకృష్ణన్ తర్వాత .. చీఫ్ జస్టిస్ కానున్న రెండవ దళితుడిగా గవాయి నిలువనున్నారు. వెనుకబడిన వర్గాల్లో ఉన్న క్రిమిలేయర్ వ్యక్తులు.. ఎలా కోటా లాభాలను పొందుతున్నారో తన తీర్పులో వివరించారు. దీని వల్ల మెజారిటీ ప్రజలు తమ ప్రయోజనాలను కోల్పోతున్నట్లు వెల్లడించారు.ఒక కంపార్ట్‌మెంట్‌లోకి ఓ వ్యక్తి వెళ్లిన తర్వాత, ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ఎవరూ రాకుండా ఆ వ్యక్తి ప్రయత్నిస్తాడని, కేవలం సామాజిక న్యాయం ప్రకారం వాళ్లకు ఆ బెనిఫిట్ వచ్చిందని, కానీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రయోజనం అందని వర్గాలను ప్రభుత్వాలు గుర్తించాలని, అందుకే క్రిమీలేయర్ విధానాన్ని రూపొందించాల్సి ఉంటుందని జస్టిస్ గవాయి తెలిపారు. ఇలా చేయడం ద్వారానే నిజమైన సమానత్వం ఏర్పడుతుందని ఆయన అన్నారు.

**ఈకేసులో వాదనలు వినిపించిన న్యాయవాదులు వీళ్లే..**

కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడ్వకేట్ కన్ను అగర్వాల్ వాదించారు. పంజాబ్ రాష్ట్రం తరపున అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ షాదాన్ ఫరాసత్, అడ్వకేట్ నటాషా మహేశ్వరి వాదించారు. సీనియర్ అడ్వకేట్ శేఖర్ నపేడా, పూర్ణిమా కృష్ణ, ఎంఎఫ్ ఫిలిప్.. తమిళనాడు తరపున వాదనలు వినిపించారు. హర్యానా తరపున సీనియర్ న్యాయవాదిఅరుణ్ భరద్వాజ్ కోర్టుకు హాజరయ్యారు.సీనియర్ అడ్వకేట్లు గోపాల శంకరనారాయణ, నిదేశ్ గుప్తా, కపిల్ సిబల్, సంజయ్ హెగ్డే, శేఖర్ పడాడే, సల్మాన్ ఖుర్షీద్, విజయ్ హన్సారియ, దామా షేషాద్రి నాయుడు.. ఉప వర్గీకరణకు అనుకూలంగా వాదించారు. సీనియర్ అడ్వకేట్ మనోజ్ స్వరూప్, అడ్వకేట్ సాకేత్ సింగ్.. ప్రతివాదుల తరపున హాజరై.. ఉప వర్గీకరణకు వ్యతిరేకంగా వాదించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమతి తరపున సీనియర్ అడ్వకేట్ కేకే వేణుగోపాల్ వర్గీకరణకు అనుకూలంగా వాదించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా హాజరయ్యారు. ఏపీ సర్కారు తరపున డాక్టర్ ఎస్ మురళీధర్ వాదించారు. కార్యకర్త జీఎం గిరి తరపున అడ్వకేట్ శివం సింగ్ వాదించారు.

### అంబేద్కర్ ప్రసంగాన్ని గుర్తుచేసిన గవాయి..



1949లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన ప్రసంగాన్ని జస్టిస్ గవాయి తన తీర్పులో గుర్తు చేశారు. సామాజిక ప్రజాస్వామ్యం కుదిరితేనే రాజకీయ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీల్లో కేవలం కొన్ని వర్గాలు మాత్రమే రిజర్వేషన్ లాభాలను అనుభవిస్తున్నారని, ఎస్సీ-ఎస్టీల్లోని కొందరు ఇంకా వేధింపులకు గురవుతున్న వాస్తవాన్ని కొట్టిపారేయలేమని, ఎక్కువ సంఖ్యలో వివక్ష జరుగుతున్న నేపథ్యంలోనే వర్గీకరణకు కోర్టు అనుకూలంగా ఉన్నట్లు జస్టిస్ గవాయి తెలిపారు. ఎస్సీల్లోని క్రిమీలేయర్‌కు చెందిన చిన్నారిని.. అదే వర్గానికి చెందిన చెత్తకుప్పలు వేరుకుని పిల్లోడితో పోల్చలేమన్నారు. ఇది చీటింగ్ అవుతుందన్నారు. క్రిమీలేయర్ విధానంపై జస్టిస్ గవాయి చేసిన సూచన పట్ల ధర్మాసనంలోని మరో ముగ్గురు న్యాయమూర్తులు సానుకూలంగా స్పందించారు. ఏ కులమైనా కేవలం తొలి తరానికే రిజర్వేషన్ ఇవ్వాలని, ఆ కుటుంబంలోని రెండవ జనరేషన్‌కు రిజర్వేషన్ ప్రయోజనాలను అందకుండా చేయాలని జస్టిస్ పంకజ్ మిఠల్ తెలిపారు. అయితే జనరల్ క్యాటగిరీతో సమానంగా రెండవ జనరేషన్ ఉందా లేదా అన్న విషయాన్ని ప్రభుత్వాలు పరిశీలించాలన్నారు. రాజ్యాంగం ప్రకారమే ఎస్సీ, ఎస్టీల్లో క్రిమీలేయర్‌ను గుర్తించాలని జస్టిస్ ఎస్‌సీ శర్మ తెలిపారు. ఓబీసీల్లో క్రిమీలేయర్ విధానం అమలులో ఉన్నదని, దాన్ని ఇప్పుడు ఎస్సీలోనూ అమలు చేయాలని జస్టిస్ విక్రమ్ నాథ్ తెలిపారు.



# నిరుపేద కుటుంబానికి కుట్టుమిషన్ అందజేత

### కుమార్తె పుట్టినరోజు సందర్భంగా డా. కాచం సత్యనారాయణ వితరణ

**చైతన్యపురి, విశ్వంభర:** సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తూ ప్రతినిత్యం నిరుపేదలకు సహాయ సహకారాలు అందించడంలో ముందుంటూ మానవత్వాన్ని చాటుతుంటారు వి-3 న్యూస్ ఛానల్ , విశ్వంభర దినపత్రిక అధినేత, కాచం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ. తన చిన్న కుమార్తె కుమారి కాచం తన్మయి పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం లింగంపల్లికి చెందిన నిరుపేద మహిళ విజయలక్ష్మికి కుటుంబ ఉపాధి కోసం కుట్టు మిషన్ అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమందికి సహాయం అందిస్తూ.. అందరినీ అక్కున చేర్చుకొని, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్న కాచం అన్నకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారి కుమార్తె కు పలువురు జన్మదిన శుభకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వి-3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక డైరెక్టర్ కాసం ఏకసాయి, కూర రమేష్, బూరుగు ప్రవీణ్, సురేష్ దండు, ఏలే మహేష్ నేత, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హత్తిగూడ చెరువును కాపాడాలి

### కమిషనర్ ఏవీ రంగనాథ్ కి ఫిర్యాదు



**విశ్వంభర, మన్సూరాబాద్:** కబ్జాకు గురవుతున్న హత్తిగూడ చెరువును కాపాడాలని, మళ్లీ రీసర్వే చేయించాలని జీ.హెచ్.ఎం.సీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి 2024 జులై 26 శుక్రవారం జీ.హెచ్.ఎం.సీ ప్రధాన కార్యాలయంలో ఎన్ఫోర్స్మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ కమిషనర్ ఏవీ రంగనాథ్ కి హతిగూడ చెరువు హద్దులను వివరించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారులు వెంటనే స్పందించారు.

**ఈ సందర్భంగా కార్పొరేటర్** మాట్లాడుతూ మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ శివారు ప్రాంతంలో ఉన్న హతిగూడ చెరువు కబ్జాకు గురవుతుందని ఇరిగేషన్, రెవెన్యూ వారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా కబ్జాదారులను ప్రోత్సహిస్తూ రెండు సంవత్సరాల క్రితం 6 ఎకరాలు ఉన్న చెరువు మ్యాప్ ను మార్చేసి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అక్రమాలతో కొత్త మ్యాపును 2 ఎకరాల్లో సృష్టించి ట్రెంచ్ లైన్ను నిర్మించి చెరువులో కబ్జా దారులు మట్టి పోస్తుంటే సమాచారం ఇచ్చినా కూడా పట్టించుకోకుండా ప్రోత్సహిస్తున్నారని అధికారులపై ఫిర్యాదు చేశారు. కనీసం కొత్త ప్రభుత్వం అయినా చెరువులను, పార్కులను కబ్జాదారుల నుండి కాపాడే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. వచ్చిన విజిలెన్స్ అధికారులకు చెరువుకు సంబంధించిన హద్దులను, ధ్వంసం చేసిన తూము, అలుగును, చెరువులోకి వచ్చే వర్షపు నీటి కాలువను మట్టితో పూడ్చివేసిన స్థలాన్ని కూడా చూపించడం జరిగింది అని అన్నారు. హతిగూడ చెరువును కాపాడుకుంటే దాదాపు జాతీయ రహదారి నుండి వచ్చే వర్షపు నీరు చెరువులోకి మళ్లించడం వలన 20 నుండి 30 కాలనీలు ముంపుకు గురి కాకుండా ఉంటాయనతెలిపారు. కబ్జాదారులకు సహకరిస్తున్న ఇరిగేషన్, ఇతర అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టి చెరువును కాపాడాలని వచ్చిన విజిలెన్స్ అధికారులకు తెలియజేశారు. మన చెరువులను కాపాడుకుంటే భూగర్భజలాలు పెరుగుతాయని, అందుకోసం డివిజన్లో ఉన్న చెరువులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ (ఈవీడీఎం) విజిలెన్స్ అధికారులు ఏఈ మల్లికార్జున్, ఎస్ఐ మోహన్, రెవెన్యూ అధికారులు హయత్ నగర్, అబ్దుల్లాపూర్మెట్ ఆర్.ఐ లు నరసింహ, బొడ బిక్షపతి, సర్వేర్ జ్యోతి, వీఆర్ఏ మల్లేష్, ఇరిగేషన్ అధికారులు డీఈ ఉషారాణి, ఏఈ తస్విన్ రజాక్, వివిధ కాలనీవాసులు అధ్యక్షులు, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.




# చేనేతరంగ అభివృద్ధికి కృషి చేసిన వెంకటేశం

### మాజీ మంత్రి ఎల్ రమణ



**వి శ్వంభర , వనస్థలిపురం :** చేనేతరంగ అ భివృద్ధికి రీజినల్ డైరెక్టర్ మునాస్ వెంకటేశం ఎనలేని కృషి చేశారని మాజీ మంత్రి, శాసనమండలి సభ్యులు ఎల్ రమణ అన్నారు. బుధవారం వనస్థలిపురంలోని ఎం ఈ రెడ్డి గార్డెన్స్ లో జరిగిన మునాసు వెంకటేశం పదవి విరమణ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 2 9 సంవత్సరాల సర్వీసులో వెంకటేశం చేనేత కళాకారుల అభ్యున్నతికి చేనేత సంక్షేమ పథకాల అమలుకు నిరంతరం పాటు పడ్డారని అన్నారు. ఏ ప్రాంతంలో పనిచేసిన ఆ ప్రాంత చేనేత కళాకారుల సమస్యల పరిష్కారానికి తోడ్పడ్డారని అన్నారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ వెంకటేశం తన సర్వీసు మొత్తం అంకితభావంతో పనిచేసి రాష్ట్ర అధికారుల మెప్పు పొందారని అన్నారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు. చేనేత రంగానికి సుమారు 100 కోట్ల రుణమాఫీ చేస్తారని అన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలోని అన్ని డిపార్ట్మెంట్లో వస్త్ర అవసరాలను చేనేత రంగం నుంచి తీసుకొని వారికి ఉపాధి కల్పించేలా చూస్తామని అన్నారు. వెంకటేశం సేవలను, అకుంఠిత దీక్షను కొనియాడారు. మాజీ శాసన మండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు, డీసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ జోగు నరసయ్య, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, చింతకింది మల్లేశం, ఎమ్ ఎస్ ఎం ఈ ఉపాధ్యక్షులు ఏపీకే రెడ్డి, పలు జిల్లాల నుండి విచ్చేసిన చేనేత కళాకారులు, సంఘాల పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ చేనేతరంగ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడ్డ వెంకటేశం అందరి అభిమానాన్ని చూరగున్నాడని అన్నారు. చేనేత స్థితిగతులపై వెంకటేశం రచించిన ఇన్ ట్రెన్సిక్ వీవర్స్ ఆఫ్ తెలంగాణ హ్యాండ్లూమ్స్ అనే పుస్తకాన్ని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆవిష్కరించారు. పదవి విరమణ పొందిన అధికారి మునాసు వెంకటేశం మాట్లాడుతూ చేనేత రంగంలో సుమారు 52 సంక్షేమ పథకాలు అమలు చేసి వారి జీవన ప్రమాణాలను పెంపొందించి నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అధికారులు చేనేత సంఘాల పాలకవర్గాలు వెంకటేశంను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో గంగుల సత్తయ్య, అంబటి సత్యనారాయణ, వడ్డేబోయిన యాదగిరి, శివకుమార్, శ్రీనివాస్, కాశీరాం, రాపోలు నరసింహ, చెరుకు విజయ్, చెరుకు స్వామి, జూలూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్ బ్యాంక్ చైర్మన్, ఎండీ ఇళ్లలో ఈడీ సోదాలు

**విశ్వంభర, హైదరాబాద్:** ఏపీ మహేశ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మనీ-లాండరింగ్ కేసు దర్యాప్తును ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముమ్మరం చేసింది. బుధవారం బ్యాంక్ ఛైర్మన్, ఎండీ, డైరెక్టర్లకు చెందిన ఇళ్లలో ఏకకాలం-లో సోదాలు నిర్వహించింది- బంజారాహిల్స్ లోని బ్యాంక్ హెడ్ క్వార్టర్స్ సహా ఛైర్మన్ రమేశ్ కుమార్ బగ్, ఎండీ ఉమేషన్ చంద్ అస్వా, వైస్ ఛైర్మన్ పురుషోత్తం మందన, సోలిపురం వెంకట్‌రెడ్డి, మరో ఇద్దరు డైరెక్టర్ల ఇళ్లు, ఆఫీసులు సహా మొత్తం 10 ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేశారు. నగదు, కీలక డాక్యుమెం-ట్లను సీజ్ చేశారు. పలు బ్యాంక్ లాకర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాలకు సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించనున్నారు. ఫేక్ డాక్యుమెంట్లతో బ్యాంక్ షేర్ హోల్డర్లకు చెందిన డిపాజిట్లలో రూ.300 కోట్లకు పైగా అనర్హులకు రుణాలు మంజూరు చేయడం, బ్యాంకు నుంచి రూ.18.30 కోట్లు దారి మళ్లిం-చారనే ఆరోపణలతో గతంలో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. బ్యాంక్ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యామసుందర్ బియాని ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. మనీలాండరింగ్, హవాలా లావాదేవీల వివరాలు సేకరిం-చారు. ఇందులో భాగంగానే సోదాలు నిర్వహించారు.

# త్వరలో తెల్ల రేషన్ కార్డుల జారీ

**(మొదటి పేజీ తరువాయి)**

ఇవ్వాలని నిర్ణయించామన్నారు. మరో అధికారి మురళి కుమారుడికి గ్రూప్ -1 ఉద్యోగం ఇవ్వనున్నట్లు వివరించారు.

**కోదండరాం, అమీర్ అలీఖాన్‌ల పేర్లతోనే...**

"ఇద్దరు ఎమ్మెల్సీల నియామకంపై గవర్నర్‌కు మళ్లీ ప్రతిపాదనలు పంపుతున్నాం. కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను మరోసారి గవర్నర్ కు పంపాలని నిర్ణయించాం. నిజాం చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. నగరంలో మూసీ సుందరీకరణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావరి జలాలను హైదరాబాద్ జంట జలాశయాలకు తరలిస్తాం. మల్లన్న సాగర్ నుంచి జంట జలాశయాలకు గోదావరి జలాలు తరలిస్తాం. గౌరవెల్లి ప్రాజెక్టు త్వరిత గతిన పూర్తి కావడానికి రూ.437 కోట్లు విడుదలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది ష అని మంత్రి పొంగులేటి తెలిపారు. కేబినెట్ నిర్ణయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.

**జీహెచ్ఎంసీ ఔటర్ గ్రామాల విలీనానికి సబ్ కమిటీ**

జీహె చ్ఎంసీ లో ఔటర్ గ్రామా ల విలీనానికి కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. జీహెచ్ఎంసీ విలీన కమిటీలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , సీతక్క, శ్రీధర్ బా బులు సభ్యులుగా ఉండనున్నారు. రైతు భరోసా విధివిధానాలపై కేబినెట్ భేటీలో చర్చించారు.





# విశ్వేశ్వరరావు సేవలు అభినందనీయం

**విశ్వంభర, హబ్సిగూడ :** శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గా పని చేసిన అయిటిపాముల విశ్వేశ్వరరావు పదవి విరమణ సన్మాన సభను హబ్సిగూడలోని అమరావతి ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందరబంగా ఆయనకు సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ సన్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు జిల్లా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ విశ్వేశ్వర రావు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి ప్రశంసలు పొందారని కొనియాడారు. టీఎన్జీవోస్ ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం నాయకుడిగా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ, అసిస్టెంట్ కమిషనర్ కిషన్, శంషాబాద్ కృష్ణ ప్రియ, మల్కాజ్గిరి డీ.పీ.ఈ.ఓ నవీన్, శంషాబాద్ ఏపీ ఈ ఎస్ శ్రీనివాస్ రెడ్డి, డీటీఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్, టీఎన్జీవోస్ ఎక్సైజ్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



# జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య

## నేడు జయంతి



భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. స్వాతంత్ర్య సమరయోధునిగా, వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాలి. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లెలో, జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించుకొని, తన 19 వ ఏట ముంబయి వెళ్ళి సైన్యంలో చేరారు.

మద్రాసులో ప్లేగు ఇనస్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇనస్పెక్టరుగా పనిచేశారు. అతని జ్ఞాన దాహం అంతులేనిది. శ్రీలంక వెళ్ళి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జ్ సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. కొంతకాలం రైల్వేలో గార్డుగా పనిచేశారు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి లాహోర్ లోని డి.ఎ.వి. కాలేజీలో చేరి, సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్ భాషలో అనర్గళంగా మాట్లాడే వెంకయ్య గారిని "జపాన్ వెంకయ్య" అని పిలిచేవారు.

1899 - 1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్ర్యోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉండగా మహాత్మా గాంధీని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధనలు జరిపారు. స్వదేశం వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ లు చూసి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుంచి జాతీయ జెండా ఎలా ఉండాలనేదానినే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయకులందరితోనూ జాతీయ పతాక రూపకల్పన గురించి చర్చలు జరిపారు.1916లో "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు.1916 లో "నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్" పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన చేశారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడైన కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశారు.1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగుర వేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన "లాలా హన్స్ రాజ్" మన జాతీయ పతాకంపై రాట్నపు చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకారంగానే, ఒక జెండాను సమకూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు.

"మడత పెడితే పిడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియ వస్త్రం"గా "గాంధీజీ"చే, వెంకయ్య రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది.

1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి సంకేతం.

**జాతీయోద్యమంలో చురుగ్గా...**

పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టాలలో పాల్గొన్నారు. వందేమాతరం, హోమ్‌రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమంలాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగళూరు, మద్రాసు లలో "రైల్వే గార్డు"గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలము బళ్లారిలో "ప్లేగు అధికారి"గా ప్రభుత్వ ఉద్యోగం చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగము చేయనివ్వలేదు.

1906 నుంచి1922 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడిగూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాసముండి, పత్తి మొక్కలలోని మేలు రకాల పరిశోధనలో భాగస్వామి అయ్యారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించారు. ఈ పరిశోధనలలో "కంబోడియా పత్తి" అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. ఆయన కృషిని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం కూడా గుర్తించడంతో ఆయనకు "పత్తి వెంకయ్య" అని పేరు వచ్చింది.

తరువాత నెల్లూరు చేరి, 1924 నుండి 1944 వరకు అక్కడే ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశారు. వజ్రకరూరు, హంపిలలో ఖనిజాలు, వజ్రాలు గురించి విశేషంగా పరిశోధనలు జరిపి ప్రపంచానికి తెలియని వజ్రపు తల్లిరాయి అనే గ్రంథం రాసి 1955లో దాన్ని ప్రచురించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు పనిచేశారు.

అయితే వెంకయ్య జీవిత చరమాంకం దయనీయ స్థితిలో ముగిసింది.1960 లో భారత ప్రభుత్వం భూగర్భ ఖనిజాల సంస్థ సలహాదారునిగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడిన వెంకయ్య చివరి రోజుల్లో తిండికి కూడా మొహం వాచి, నానా అగచాట్లు పడినట్లు ' త్రివేణి ' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయవాడలో డా. కె.ఎల్.రావు, డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ " నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక " అన్నారు.

ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964 లో జూలైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించినా, విజయవాడ గాంధీ హాల్ నందు విగ్రహావిష్కరణ జరిగినా, భారతీయులు ఆచంద్ర తారార్కం గుర్తుంచు కోవలసిన పింగళి వెంకయ్యకు... రావలసినంత గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్ పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి, కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.

# వర్గీకరణ ఒక సుదీర్ఘ ఉద్యమం

### ప్రజా పోరాటాలకు పాలకులు తలవంచాల్సిందే

నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ వల్ల దేశంలో దళితుల పరిస్థితి పురాణాల నుంచి ఆధునిక రోజుల వరకు హీనంగా ఉండడం దారుణమైన విషయం. అణగారిన వర్గాల సామాజిక సమస్యల పరిష్కారానికి శతాబ్దాల తరబడి ఎంతో మంది పోరాడుతున్నారు. అందులో ఎవరి శక్తి మేరకు వారు కృషి చేశారనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో దేశానికి రాజ్యాధికార స్వాతంత్ర్యం, సామాజిక స్వాతంత్ర్యం కూడా కావాలని అంబేద్కర్ చేసిన పోరాటం అనిర్వచనీయం. ఆయన పోరాటం, బోధనలు ఇప్పటికీ ఎన్నో సామాజిక ఉద్యమాలను ప్రభావితం చేస్తున్నాయి. వాస్తవంగా దళితుల్లో కూడా ఆర్థిక అసమానతలు తీవ్రంగా ఏర్పడ్డాయంటే అతిశయోక్తికాదు. అందుకు పలు రాష్ట్రాల్లో దళిత ఉపకులాల వర్గీకరణ ఉద్యమాలే నిలువెత్తు నిదర్శనం. ముఖ్యంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట సంస్థగా ఏర్పడిన మంద కృష్ణమాదిగ చేస్తున్న ఉద్యమాలు ప్రశంసనీయం.సుమారు 30 ఏళ్లుగా మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ గతంలో ఎన్నో సమావేశాలు, బహిరంగసభలు పెద్ద ఎత్తున విజయవంతం కావడం శుభకరమైన విషయం. ఈ సభకు ఆర్థిక పోరాటాలే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం అని నమ్మి, సామాజిక ఉద్యమాలని దశాబ్దాలుగా పట్టించుకోని కమ్యూనిస్టులు మద్దతు పలకడం నిజంగా ఉత్తేజకరం. కమ్యూనిస్టుల నుండి కాంగ్రెస్, తెలంగాణ లోక్ సత్తా, అధికార కమలనాథులు, వివిధ సామాజిక సంఘాల నాయకులు. మేధావులు. ఉద్యమకారులు .కవులు. కళాకారులు అందరూ హాజరయ్యారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంఆర్పిఎస్ కు నాయకత్వం వహిస్తున్న మందకృష్ణ మాదిగకు శుభాకాంక్షలు. అలాగే సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ విజయం అమరవీరులకు, వర్గీకరణ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి అంకితం.



- మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్ సత్తా పార్టీ,
రాష్ట్ర అధ్యక్షుడు
ఫోన్ :9550844433

# సామాజిక చైతన్య స్ఫూర్తి... కొండేల మారుతి

**ప్రజా క్షేత్రం లో...
యాభై వసంతాలు..
యాభై సంస్థలు..
యాభై వేదికలు
2500 కార్యక్రమాలలో పాత్ర..
స్వయంగా 1570 కార్యక్రమాల నిర్వహణ ..**



పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన సామాజిక కార్యకర్త కొండేల మారుతి గురించి సంక్షిప్త పరిచయం ఇది. ఈ అంకెలు చాలు ఆయన ఎంత నిబద్ధతతో ...నిర్విరామంగా సమాజ సేవలో నిమగ్నమయ్యారో చెప్పడానికి. ఒక వ్యక్తి ఇన్ని రకాలుగా ఆలోచించవచ్చా? ఒక్క రోజు కూడా విశ్రాంతి తీసుకోకుండా ఇన్ని కార్యక్రమాలు నిర్వహించవచ్చా? అని అబ్బురపరిచే వ్యక్తిత్వం మారుతిది. పదవుల కోసం పాకులాడకుండా కన్న ఊరి కోసం... సమాజం కోసం అనుక్షణం పరితపించే ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయం. తన పదహారేళ్లలో ప్రాయంలోనే (1974) నేతాజీ యువజన మిత్రమండలి స్థాపించారంటే బాల్యం నుంచే ఆయనకు ఉన్న సామాజిక చింతను అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత యువజన సమితి, విద్యాసమితి, మోటార్ వర్కర్స్ యూనియన్, మంథని విద్యార్థి యువత మొదలైన యాభై సంస్థలకు అంకురార్పణ చేశారు. మంథని విద్యార్థి యువత పేరుతో ఇప్పటికీ ఆయన ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఆలోచించని...దృష్టి పెట్టని రంగమే లేదంటే అతిశయోక్తి కాదు. బహుముఖీనంగా ఆయన సేవలు విస్తరించాయి.

**ఆమరణ దీక్షతో డిగ్రీ కళాశాల సాధన**

మారుతి స్వచ్ఛంద కార్యక్రమాల నిర్వహణకే పరిమితం కాకుండా సామాజిక సమస్యలపై అనేకసార్లు ఉద్యమించారు. మంథనిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని 1980 అక్టోబరులో ఆమరణ దీక్షకు కూర్చున్నారు. ఆయన దీక్షకు స్పందించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 8 రోజుల్లోనే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సమ్మతి తెలుపుతూ లేఖ పంపింది. ఆయన దీక్ష విరమించిన రోజున మంథని ప్రజానీకం ఆయనకు నీరాజనం పట్టింది. 1981 విద్యా సంవత్సరంలోనే మంథనిలో డిగ్రీ కాలేజి ప్రారంభమైంది. జూనియర్ కాలేజీ ఆవరణలోనే బీఏ, బీకాం తరగతులు మొదలయ్యాయి. ఇంటర్ తర్వాత చదువులు మానేసిన వారెందరో ఉన్నత చదువులు చదివుకునేందుకు ఇది అవకాశమిచ్చింది. ముఖ్యంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేని విద్యార్థినులు డిగ్రీ చదివి నేడు ఉన్నతోద్యోగాలు చేయగలుగుతున్నారంటే మంథనిలో ప్రారంభమైన ఈ డిగ్రీ కళాశాలే కారణం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలా వందల మంది జీవితాల్లో వెలుగులు పూయించిన ఘనత మారుతికే దక్కుతుంది. మద్యపాన, సారా నిషేధ ఉద్యమాల్లోనూ పాల్గొని ప్రజలను చైతన్య పరిచారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 250కి పైగా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ భావ వ్యాప్తికి విశేషంగా శ్రమించారు. వయోజన విద్య, అక్షరాస్యత ఉద్యమాలలోనూ క్రియాశీల పాత్ర పోషించారు.

**వైవిధ్య కార్యక్రమాలతో స్ఫూర్తి**

కొండేల మారుతి నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతూనే ఉంటారు. కరవు, వరదలు, తుఫానుల సమయాల్లో విరాళాలు సేకరించి ప్రధానమంత్రి , ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపేవారు. రక్తదాన శిబిరాలు, వనమహోత్సవాలు, ఆదర్శ వివాహాలకు చేయూత, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, బ్యాగుల పంపిణీ, వివిధ రకాల పోటీల నిర్వహణ, విజేతలకు బహుమతుల పంపిణీ చేస్తుంటారు. సాహిత్యానికి సంబంధించి కవిసమ్మేళనాలు, చర్చాగోష్ఠులు నిర్వహిస్తారు. అంతర్జాల వేదికగా కూడా పలు సాహితీ , సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తుంటారు. వినియోగదాల్లో చైతన్యానికి ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తుంటారు.

అంతర్జాతీయ దినోత్సవాల నేపథ్యంలో మే డే.. మహిళా దినోత్సవం, మాతృభాషాదినోత్సవం.. సంగీత దినోత్సవం లాంటి వాటిని నిర్వహిస్తూ సంబంధిత రంగాల్లో ప్రతిభ చూపే వారిని సగౌరవంగా సన్మానిస్తారు. కార్మిక, కర్షక, మహిళా విద్యార్థి రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంటారు.

**పాత్రికేయుడిగా సేవలు**

కొండేల మారుతి మంథని కేంద్రంగా దశాబ్దానికి పైగా పాత్రికేయుడిగా పనిచేశారు. 1982 నుంచి 1984 వరకు ఈనాడు విలేఖరిగా, 1986 నుంచి 1994 మధ్య ఆంధ్రజ్యోతి విలేఖరిగా సేవలందించారు. మారు మూల ప్రాంతంలోని ఎన్నో సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేశారు.

వెనుకబడిన ప్రాంత వార్తలు పత్రికలలో రావడం అరుదైన ఆ రోజుల్లో నిత్యం మంథని ప్రాంత వార్తలు ప్రముఖంగా ప్రచురితం కావడం వెనక ఆయన కృషి ఉంది. ఇప్పటికీ ఆయన మంథని అభివృద్ధికి సంబంధించి ఎన్నో ప్రణాళికలకు రూపకల్పన చేస్తూ ప్రభుత్వం దృష్టి తీసుకు వెళ్తుంటారు. వాటిపై చర్చా గోష్ఠులు నిర్వహిస్తూ ప్రజలలో ఆలోచన రేకెత్తిస్తుంటారు.

**మంథనేయుల మధ్య వారధి**

మంత్రపురి, మంత్రకూటంగా పేరొందిన ఈనాటి మంథని ఎందరో ప్రముఖులకు పుట్టినిల్లు. ప్రధాని పీవీ నరసింహారావు రాజకీయ రంగ ప్రవేశం చేసింది ఇక్కడి నుంచే. ఆనాటి వేద విద్యలకు, ఈనాటి ఆధునిక చదువులకు పేరొందిన అగ్రహారం. ఇక్కడి నుంచి వేలాది మంది అమెరికా సహా ప్రపంచంలోని అనేక దేశాలలో ఉన్నతోద్యోగాలు చేస్తున్నారు. వారందరిని ఏకం చేసే వారధి కొండేల మారుతి. ఏ దేశంలో ఎవరున్నారనే వివరాలు సేకరించడంతో పాటు వారిని మంథని అభివృద్ధిలో భాగస్వాములు చేయడానికి ఆయన నిరంతరం ప్రయత్నిస్తుంటారు. అలాగే మన దేశంలోనే వివిధ రాష్ట్రాలలో, వివిధ ప్రాంతాలలో ఉన్న మంథని వారిని ఏకం చేసేందుకు నిరంతం కార్యక్రమాలు చేపడుతుంటారు. గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్న వారిని పిలిపించి సగౌరవంగా సన్మానిస్తూ వారి స్ఫూర్తిని నేతి తరానికి అందించడానికి నిరంతరం కృషి చేస్తారు. మంథని కీర్తిని ప్రపంచమంతటా వ్యాప్తి చేయాలని తపన పడుతుంటారు. స్థానిక ప్రముఖుల జయంతి, వర్ధంతల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుంటారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా చైతన్యానికి కృషి చేస్తుంటారు. అనేక స్వచ్ఛంద, సాహితీ సంస్థల మధ్య వారధి ఆయన. ఆర్థిక వనరులు పరిమితమైనా అందరి సహకారంతో యాభై ఏళ్లుగా నిరంతరం సమాజ సేవలో నిమగ్నమై మంథెన్న జ్యోతిగా గుర్తింపు పొందిన ఆయన వ్యక్తిత్వం ఆదర్శప్రాయం..స్ఫూర్తి దాయకం.

*(కొండేల మారుతి సేవా ప్రస్థానం యాభై ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో రేపు మంథనిలో ఆయనకు ఆత్మీయ సన్మానం సందర్భంగా)*



- రావికంటి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్
9908892067

# మానవీయ తరంగాలై విహరించిన మనం కవిత్వం

"మనం చలించే అచలాలం - నోళ్ళు తెరిచిన గండ శిలలం
అగుపించని శంపాలతలం - గడ్డకట్టిన దుఃఖాలం
వెలుతురులో సంచరించే చీకటి జీవాలం మనం
కేవలం మనం కాని మనం..."(మనం)

సరిగ్గా రెండు దశాబ్దాల కింద వెలువడిన మనం కవిత్వ సంపుటిలోని పంక్తులు అయినప్పటికీ ఇప్పటికీ ఈ తరం వాళ్ళకి హత్తుకునే కవిత్వం ఉండటం విభిన్నతకు నిదర్శనం. మానవీయ కవి ఉద్యమకారులు వేణూ సంకోజు గారి దార్శనికత సార్వజనీనత కనపడుతుంది. అనేకానేక సందర్భాలను సౌందర్యవంతంగా కళాత్మకంగా చెబుతూ తనదైన శైలిలో పద విన్యాసం,శబ్ద విన్యాసం చేస్తూ సామాజిక సంఘర్షణలను,మానసిక సంవేదనలను తాత్విక మార్మిక లోతులను మానవీయ కోణాలతో కరుణ రసార్ద్ర హృదయంతో అంతరంగ భావనా వాహినిని ప్రవహింప చేస్తాడు.

విస్తృతమైన వస్తు వైవిధ్యంతో తనకు ఎదురైన ప్రతి అనుభవాన్ని కవిత్వీకరించాలని ఆరాటపడ్డ నిరంతర అన్వేషిగా ఈ కవి దర్శనమిస్తాడు. సరళమైన పదజాలంతో పాఠకుడితో సంభాషిస్తూనే వ్యంగ్య బాణాలనూ వదులుతాడు. ప్రశ్నించడమూ అందిస్తాడు. తన తాత్విక చింతనతో కవిత్వ ఆల్కేమీ అందించి హృదయాలను కదిలిస్తాడు,కరిగిస్తాడు.

**"నిరాశల్ని చీల్చే కలలు చావు**
భయాలకూ బెదిరింపులకూ లొంగి ఉండ చుట్టుకు పోవు
కలలు శవాలుగా నిర్జీవంగా ఏనాడూ మిగలవు
చరియలుగా దుర్మార్గంపై విరుచుకుపడే కలలిట్టే ముగియవు".. (గడ్డ కట్టని కలలు)

మనిషి కనే కలల గురించి చెబుతూ ప్రతి కల మనిషి నుండి మనిషి దాకా పయనించే ఒక మనో నౌకవుతుందనీ, క్షణాల్ని యుగాల అనుభూతిగా పరిమళింప జేసే అసలు పుష్పక విమానమవుతుందనీ, అసలు మనిషే కలల చిరునామా అని అనేక కోణాలను ఆవిష్కరిస్తాడు.

"బతుకు లేనితనం కింది చావును గెలవనే లేదు
పదే పదే ఓటమిని ఆవలి గెలుపు లోపలి ఓటమిని చూడలేదు
వేయి ముఖాల దుఃఖాన్ని కాల్చనే లేదు
సుత్తెనూ - సూదినీ - మగాన్నీ అడగనే లేదు" (వేయి ముఖాల దుఃఖం)

సబ్బండ వర్గాల ఆకలికీ, ఆవేదనకూ బాసటగా నిలవడం తోపాటు అనాథ గాథల అపసవ్యాన్ని మూలాల గురించి కవి పడ్డ ఆరాటం స్పష్టమవుతుంది.

"కొడి గట్టుకు పోతున్నా వెలుగునే ప్రసరిస్తూ
ఆత్మవిశ్వాసం కురుస్తూ తీవ్రతరమవుతున్న క్షణం ఒకటే
కోరినంత ఎత్తులకు నా చేయి పట్టుకు లేచిన
పసితనపు భూమి ఒక్కటే" (బతికిన ఆనవాలు)

జీవితానికి ఎదురయ్యే అనేక సందర్భాలలో దుఃఖం నదులకు ఎదురీది నిలవాలన్నా పరిణామశీలతను ఉద్బోధించిన కవిత్వ శైలి కనపడుతుంది.




"జీవితం చుట్టూ అలుముకొని పెనవేసుకుపోయే సాయంత్రమే
మనిషి కాలం మీద సంతకం చేసి మురుస్తుంది" (అరుదైన కరచాలనం)

జీవితమనేది అనుభూతుల సీమలకు వింత స్పర్శతో దారి చూపుతుందని సుతిమెత్తగా, సుకుమారంగా చెబుతూనే జీవితం యొక్క అపురూపతను అందంగా చాటినాడు.

"నేను మరల - మరల పసివాడినౌతాను
అన్నీ పారేసుకుంటాను
కోరికల జాబితా నుండి వయసును ముందుగా జారవిడుచుకుంటాను
నేను ఏది విసిరేసినా నక్షత్రమై రాలుతుంది
ఎం చక్కా మానేయడం నేర్చుకుంటాను
దాచుకోవడం కన్న పంచుకోవడం ఇష్టపడతాను" (కొత్త బయలు)

బూజు జ్ఞాపకాలు దారి పొడవునా జారిపోతుంటవని అమూల్యమైన బాల్యపు జ్ఞాపకాల గురించి ఎదురీదిన జీవన గమన స్వగతాన్ని ప్రత్యేక పదచిత్రాలతో ఆవిష్కరించాడు.

"అక్షరం పిపాస - అనంత తృష్ణ
అక్షరం మన ఆత్మలకొక బహిర రూపం
అంధుడు స్పృశించినా ఆనందంగా అలలు అలలుగా
ప్రసరించే అక్షరం" (ప్రవహించే స్పృహ)

అక్షరం నిరంతర చలనశీల మైనదని అమ్మ నుండి నాన్న నుండి ప్రతి శిశువు లో మరల మరల అవతరిస్తుందనీ విశ్వాన్ని ఒక పలకగా మలుచుకునే జ్ఞాన ప్రవాహ స్పృహ అక్షరమనీ ప్రాణప్రదమైన ప్రతి కదలికా అక్షరమేనని కవి ఆలోచింప చేస్తాడు.

"మనిషిని చంపి సాధించబోయే కైవల్యాలకు స్వస్తి
మతమున్నా లేకున్నా మనిషుండాలి
మనిషి కావాలి మాకు మనిషే కావాలి" (మనిషనే పచ్చి నిజం)

మనిషి కోసం మనిషిచ్చే జీవిత హామీ కోసం తాపత్రయ పడుతున్న అన్వేషకుడుగా కవి కనపడుతూనే మనుషుల మధ్య నిర్జీవ సంబంధాలు పోవాలని సకారాత్మక పలకరింపులు ఉండాలని అభ్యుదయం కాంక్షించే అశేష ప్రజానీకం గొంతుకను కవిత్వం స్వరంతో వినిపిస్తాడు

"ఆకాశమై ఎప్పుడో ఎగసింది మనసు
మనిషే యింగా స్వేచ్ఛై రెక్క విప్పని పక్షి
పసితనాన్నే ఎద్దు మూపురం చేసుకుని
తన్నుతాను ఈడ్చుకునే రెండుకాళ్ళ పిపీలకం
మనిషింకా నడుమొంగిన పిరికితనపు మెకం" (కారుచౌక)

ప్రపంచీకరణ నేపథ్యంలో ముందుకు సాగుతున్న మనిషి సాంకేతికతని అందిపుచ్చుకున్న మనిషి మానవత్వం దారుల్లో ప్రయత్నిస్తున్నప్పటికీ ఒకరిమీద ఒకరు ప్రయోగాలు చేస్తూ మానవ ప్రమాణాలని నిస్సారం చేసుకుంటున్నారన్న కవి ఆర్తి ఆవేదన కనపడుతుంది.

"నీకైతే నాలుగు దిక్కులు కాకుంటే దిక్కుల మధ్య గుండా దిక్కుల్ని పేని
ఎనిమిది చేస్తావు పజ్జెనిమిదిగా చూస్తావ్
ఆ తర్వాత ఏ దిక్కు?
చెట్టును చూడు అన్ని దిక్కులా వ్యాపిస్తుంది"... (నీకైతే)

ప్రకృతి ప్రత్యేకతను ప్రకృతిలోని గొప్పతనాన్ని,చెట్టు విస్తృతిని చిత్రించిన తీరు ఆకట్టుకుంటుంది.

"రిమోట్ కి ఆత్మలను ఆరేసుకుంటూ
ఇక్కడ క్షేమంగానే ఉన్నాం
అటకెక్కలేని ఉత్తరాలు ఫ్లాపీలకెక్కుతాయి
గాయాలను కేసెట్లకెక్కించుకో లేని జీవితం
ఒక కుళ్ళిన తమాషా కింద తేలుతుంది" (మేమంతా క్షేమంగానే ఉన్నాం)

మనిషి మనసును చెరిపేస్తున్న టీవీలతో మానవ సంబంధాలన్నీ మృగ్యమై పోతున్నవన్న కళ్ళముందటి సత్యాన్ని సందేశాత్మకంగా కవిత్వీకరించారు.

పచ్చ పచ్చని మృత్యు జ్ఞాపకం , వేయి ముఖాల దుఃఖం,నేనింకా మృత్యువుకై వేచి ఉండలేనని, నానుండి నన్ను, మరణపు నిఘా, మృత్యువుతో ముఖాముఖి, వంటి కవితా శీర్షికలు పరిశీలిస్తేనే కవి యొక్క తాత్వికత ఏంటో తెలుస్తుంది. కవి ఎటు వైపు ఉన్నాడన్న విషయమూ స్పష్టమవుతుంది. మొత్తం యాభై ఐదు కవితలున్న ఈ సంపుటిలో ఏ వస్తువును హీనంగా చూడకుండా ఎన్నింటినో కవిత్వంగా మలిచి, పాఠక హృదయాలను గెలిచి శాశ్వతంగా నిలిచే కవిత్వ స్రవంతిని అందించారు. సహృదయ కవిగా తెలంగాణ ను సాధించిన ఉద్యమకారుడిగా సాహిత్యాన్ని జీవితాన్ని ఒకే సరళరేఖలో నడిపి ఎందరికో ఆదర్శంగా నిలిచిన గౌరవనీయులు మా నల్లగొండ కాళోజీ వేణూ సంకోజు గారికి జయహోలు.



-డా.మండల స్వామి
9177607603



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో భార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎండీ ఇస్మాయిల్ ప్రథమ వర్ధంతి బుధవారం జరిగింది. ఈ సందర్భంగా భువనగిరి కోర్టు పరిధిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది యువ న్యాయవాదులు రక్తదానం ఇవ్వడం జరిగింది.

– విశ్వంభర, రామన్నపేట

# సీఎం దిష్టిబొమ్మ దహనం



**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి పట్టణంలోని శాస్త్రి చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అవమానకరంగా వాక్యాలు చేసిన రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి స్త్రీలను అవమానించడం అసెంబ్లీ చరిత్రలో ఎన్నడూ జరగలేదని కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు అన్నారు. దిష్టిబొమ్మ దగ్ధం చేసే కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. వెనక్కి తగ్గని బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా కాకుండా ప్రజాసేవకులుగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలి

### రవాణా శాఖ అధికారి సందానీ

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రమాదాల నివారణకు వాహనదారులు, డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి సంధాని తెలిపారు. గురువారం భూపాలపల్లి సీఐ నరేష్‌తో కలిసి ఆర్టీఓ కార్యా లయంలో రహదారి నియమాలు పాటించుట, ప్రమాదాల నివారణ, వాహన దారులు పాటిం చాల్సిన నియమ, నిబంధనలపై లారీ ఓనర్ అసోసియేషన్, లారీ డ్రైవర్లుతో రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీఓ సంధాని మహ్మమద్ మాట్లాడుతూ లారి డ్రైవర్లు, ఓనర్లు రహదారి భద్రతా నియమాలను పాటించాలని అన్నారు. రహదారి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఓవర్ స్పీడ్, ఓవర్ టేక్ చేయడం, మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం నేరమని తెలిపారు. అనుమతి లేని ప్రదేశాలలో వాహనాలను పార్కింగ్ చేయడం నిషేధమని, అలాంటి సంఘటనల వల్ల ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రతి వాహనదారుడు ఖచ్చితంగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. సకాలంలో వాహన పన్నులు చెల్లించాలని, అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని డీ.టీ.ఓ సందాని పేర్కొన్నారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీనివాస్, కాకతీయ లారీ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులదేనని, కాంగ్రెస్ ప్రభుత్వం సత్వరమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎల్లంకి మహేష్, పేరబొయిన మహేందర్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు (ఎం) మండల కమిటి సమావేశంలో వారు మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని పోటీ పరీక్షలు రాసే కొత్త అభ్యర్థులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా లక్షలాది మంది యువత భవిష్యత్ అంధకా రంలోకి నెట్టివేయబడ్డారని గుర్తు చేశారు. ఎన్నో ఆకాంక్షలతో తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అయినా నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బత్తిని నరేష్, ఎండీ నయీం, బాషబొయిన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# తడి, పొడి వ్యర్థాల సేకరణ పక్కాగా జరపాలి

- గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్రతి ఇంటి నుండి వ్యర్థాల సేకరణ పక్కాగా జరపాలి
- పారిశుద్ధ్య కార్యక్రమాలు పర్యవేక్షణకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేయాలి
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- టెలికాన్ఫరెన్స్ లో అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి :** ప్రతి ఇంటి నుండి తడి, పొడి వ్యర్దాల సేకరణ పక్కగా జరపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇళ్ళలలో నుండి వ్యర్దాలు సేకరణ, స్వచ్ఛ వాహనాలకు జీపీఆర్ఎస్ ఏర్పాటు, సురక్షిత మంచినీటి సరఫరా, అంటు వ్యాధులు నియంత్రణ చర్యలు, వన మహోత్సవం, యానిమల్ బర్త్ కేర్ యూనిట్ అందుబాటులోకి తేవడం తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, వైద్య, విద్యా, ఆర్ డబ్ల్యూఎస్, డీఆర్డీఏ, ఇరిగేషన్, ఎంపీడీఓలు, ఎంపీవోలతో గురువారం ఐడీఓసీ కార్యాలయం నుండి కలెక్టర్ రాహుల్ శర్మ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పర్యవేక్షణకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి రేపటి లోగా టీముల వివరాలు అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ స్థాయిలో గ్రామ పంచా యతి ప్రత్యేక అధికారి, పంచాయతి కార్యదర్శి, ఏఎన్ఎం ఆశా, మహిళా సంఘాలు, యువతతో టీములు ఏర్పాటు చేయాలని డీపీఓకు సూచించారు. అలాగే మున్సిపల్ స్థాయిలో వార్డు ప్రత్యేక అధికారి, వార్డు అధికారి, మెప్మా రిసోర్స్ పర్సన్స్, కౌన్సిలర్లతో టీములు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. రేపటి లోగా గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో టీములు ఏర్పాటు జాభితా అందచేయాలని తెలిపారు. మున్సిపాలిటీలో వర్మి కంపోస్టు జరగడంలేదని వారం రోజుల్లో వర్మీ తయారు ప్రక్రియ ప్రారంభం కావాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కుక్కల వృద్ధి నియంత్రణ చర్యల్లో భాగంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహణకు యానిమల్ భర్త్ కేర్ యూనిట్ ను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. కుక్కలు సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో తక్షణమే చర్యలు చేపట్టి నియంత్రణ శాస్త్ర చికిత్సలు చేపట్టాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటే అంశాలపై పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, వ్రకృత్వ పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. అంటువ్యాధులు నియంత్రణలో సురక్షిత మంచినీటి సరఫరా అత్యంత ప్రధానమని, మంచినీటి వనరులను నెలలో మూడు దఫాలు క్లోరినేషన్ చేయాలని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ లు, మున్సిపాలిటీలో మురుగునీటి నిల్వలున్న ప్రాంతాలను గుర్తించి పరిశుభ్రం చేయాలన్నారు. దోమలు వ్యాప్తి నిరోధానికి మురుగునీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని తెలిపారు. అలాగే ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపచేసి భూగర్భజలాలు పెంచడానికి కమ్యూనిటి ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని డీఆర్డీఓ ను ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని ఇండ్లను గుర్తించి నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువులు తనిఖీ, పరిరక్షణ చర్యలు చేపట్టాలని చెరువుల పరిస్థితిపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అన్ని శాఖల సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ప్రతి కుటుంబం డ్రై డే పాటించి ఇంటి పరిసరాలు పరిశుభ్రం చేయు విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాకు వర్ష సూచన ఉన్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లులో నివాసం ఉండకుండా చూడాలని, వంగిన చెట్లు, వంగిన విద్యుత్ స్థంభాలు తొలగించాలని అలాగే తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని పంచాయతీ రాజ్, మున్సిపల్, విద్యుత్ అధికారులను ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా కేటాయించిన లక్ష్యం మేర అన్ని శాఖలు మొక్కలు నాటాలని అలాగే పంచాయతి, మున్సిపల్ స్థాయిలో ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేయాలని ఆదేశించారు. మొక్కలు లెక్క పక్కాగా ఉండేందుకు ప్రతి మొక్కను జియా ట్యాగింగ్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలో శ్రమదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాలలో యువతను, గ్రామ పెద్దలను, మహిళా సంఘాలను భాగస్వాములను చేయాలని ఆయన స్పష్టం చేశారు. పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణపై నివేదికల అందజేయాలని డీపీఓ, మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. మండల, మున్సిపల్ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి కార్యక్రమాల నిర్వహణకు సన్నద్ధత చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇంటింటి సర్వేలో భాగం జరుగుతున్న సర్వేలో జ్వరాలు ప్రబలన ప్రాంతాల్లో అత్యవసర వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి వ్యాధులు నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. గత సంవత్సరం వ్యాధులు ప్రబలిన ప్రాంతాలను గుర్తించి ముందస్తు వ్యాధి నియంత్రణకు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో కార్యక్రమాలు పకడ్బందీ నిర్వహణకు కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని డిపిఓను, మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరావు, డీఆర్డీఓ నరేష్, జిల్లా వైద్యాధికారి డా.మధుసూదన్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర రావు, ఇరిగేషన్ అధికారులు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

**విశ్వంభర, డిండి :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెతావత్ లాలూ నాయక్, దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ అన్నారు. అణగారిన వర్గాల దశాబ్దాల పోరాటానికి న్యాయం జరిగిందన్నారు. అలుపెరుగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగతో పాటు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ పూర్తి మద్దతుతోనే వర్గీకరణకు సామాజిక న్యాయం సాధ్యం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డిండి పట్టణ అధ్యక్షుడు గాయాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.






## ఎస్సీ వర్గీకరణపై సుప్రీంతీర్పు హర్షణీయం

### బండ్రు శోభరాణి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పుపై తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభరాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ అమలు కావడం చాలా సంతోషకరమన్నారు. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీ విజయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఉషామెహ్రా కమిషన్ యొక్క నివేధిక ఆధారంగానే గురువారం ఏడుగురు జడ్జీలతో కూడిన ధర్మాసనం వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# పత్తిలో రసం పీల్చే పురుగులను అరికట్టాలి

**విశ్వంభర, ఆమనగల్లు :** అమనగల్ మండలంలోని శెట్టిపల్లి, చెన్నంపల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి పర్యటించారు. వానకాలంలో రైతులు వేసిన వరి, మొక్కజొన్న, పత్తి, జొన్న ఇతర పంటలను పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల బెడద నివారణకు ఇమిడాక్లోప్రేడ్ ఒక గ్రాము ఎసి పెట్ రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని అంతేకాకుండా అక్కడక్కడ మొక్కలు ఎర్రబారి చనిపోతున్నాయి కాబట్టి వీటి నివారణకు స్పాంట ఒక కిలో ం కాపర్ ఆక్సి క్లోరైడ్ 500 గ్రాములు ఎకరాకి కలిపి మొక్క మొదట్లో పోయడం కానీ లేదా స్ప్రే చేయడం గాని చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి రైతులు కట్ట పర్వతాలు, బీరయ్య, జంగయ్య, సంతోష పాల్గొన్నారు.



# తల్లిపాలే ముద్దు.. డబ్బా పాలు వద్దు

**విశ్వంభర, నారాయణఖేడ్ :** పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్వైజర్ భాగ్యమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్ద శంకరంపేట మండలం అల్లాదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పెద్ద శంకరంపేట కేంద్రంలోనీ 9వ అంగన్వాడి సెంటర్లో గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూపర్వైజర్ భాగ్యమ్మ హాజరై మాట్లాడారు. నవజాతి శిశువులకు తల్లిపాలే అమృతంలో సమానం ఆ పాలలో బిడ్డకు సరిపడే పోషకాలు ఉంటాయన్నారు. బిడ్డ పుట్టిన అరగంట నుంచి గంటలోపు మొదటిసారి తల్లుపాలు ఇవ్వాలి, మొదటి మూడు రోజులు బిడ్డకు ఈ పాల ద్వారా కొలస్ట్రామ్ అనే పోషక పదార్థం లభించడం వల్ల భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులను నివారిస్తుందన్నారు. బిడ్డ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిపాలే ముఖ్యం. ఈ విషయంలో చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా బిడ్డలు రక్తహీనత ఇతర వ్యాధులతో బాధపడుతున్నారు. ఆధునిక సమాజంలో చాలా మంది బిడ్డలకు తల్లిపాలు పట్టడం లేదు. శరీర సౌందర్యం తగ్గుతుందని అపోహతో చాలా మంది నేటికీ తమ పిల్లలకు డబ్బా పాలను తాగించడం వల్ల తల్లి పాల ద్వారా వచ్చే పోషకాలు వాళ్ళకి అందడం లేదని అన్నారు. దీనిపై అవగాహన పెంచేందుకే ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటి నుండి ఏడు వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సరళ, తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.






# నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలి

**విశ్వంభర, డిండి :** డిండి మండలంలోని గోనబోయినపల్లి సీపీఐ గ్రామశాఖ సమావేశం రాసాల మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీపీఐ పార్టీ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు మంజూరు చేయక రాష్ట్రంలోని ప్రజలంతా ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజలకు నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు హనుమండ్ల కేశవులు, నడింపల్లి మల్లయ్య, గుండ పూ- రషోత్తం, గుండు పెద్దయ్య, నాగరాజు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

**చండూర్, విశ్వంభర :** రెండు సంవత్సరములు వరకు ప్రతినెల 20 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ఈ సంవత్సరం జనవరి నెల ఒకటో తేదీన ప్రారంభించిన గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ" కార్యక్రమం గురువారం స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు చండూరు మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ చండూరు మున్సిపాలిటీ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్, గాంధీజీ విద్యాసంస్థల ఉపాధ్యాయుల చేత ఎనిమిదవ నెల నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకుంటున్న గాంధీజీ ఫౌండేషన్ ను అభినందించారు. భవిష్యత్తులో గాంధీజీ ఫౌండేషన్ పేదలకు మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, గాంధీజీ విద్యాసం స్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ సత్యనారాయణమూర్తి, పాలకూరి కిరణ్, కృష్ణయ్య, ఆనంద్, వెంకటేశ్వర్లు, వెంకన్న, శివ ప్రసాద్, మణిశంకర్, లింగస్వామి, ఆంజనే యులు, నాగరాజు, బుషిపాక యాదగిరి, బోడ విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆషాడం గ్రామదేవతలకు అత్యంత ప్రీతికరం



**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆషాడ మాస వనభోజనాల సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోరుట్ల కాలేజ్ గ్రౌండ్ వద్దగల శ్రీ దుర్గా దేవాలయం ఆషాడ మాస బోనాల మహోత్సవానికి హాజరై శ్రీ దుర్గా అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు పట్టణ బీజేపీ అధ్యక్షుడు బొడ్ల రమేష్, మధ్యల లావణ్య, విజయ్, నరేష్, పట్టణ బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు. వార్డ్ కౌన్సిలర్ పెండింగ్ గణేష్, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు సురభి నవీన్ పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా రోడ్డుపై బైఠాయింపు

**విశ్వంభర, మేడ్చల్ :** పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిల పైన ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మేయర్ పాల్గొని వరంగల్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ప్రత్యేక గౌరవం, స్థానం ఉందని కనీస సోయి లేకుండా ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమయితామంటూ, ముంచుతారంటూ, జీవితం బస్టాండ్ పాలవుతుందంటూ ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా తన స్థాయి మరిచి చేసిన నీచమైన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరం ఖండిస్తున్నమని



తెలిపారు. సీఎం వ్యాఖ్యలు కేవలం ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల గురించి కాదని, తెలంగాణ మహిళలందర్నీ ఆయన అవమానించారని, మహిళలంటే కాంగ్రెస్ పార్టీకి చిన్నచూపు ఉన్నదని అందరికీ అర్థమైందని తెలంగాణలోని మహిళలందరికీ రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేసారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూధన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బాలరాజు, యాసారం శ్రీనివాస్, జగన్ రెడ్డి, జోగి రెడ్డి, కిరణ్, కైసర్, మల్లం వెంకటేష్ గౌడ్, శ్యామల నర్సింహా, శంకర్ రావు, కళ్యాణి, ఇందిరా, మల్లిక, పుష్ప, పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ మహిళా ఎమ్మెల్యేలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**విశ్వంభర, కడ్తాల్ :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా రెడ్డి ఇతర మహిళా ఎమ్మెల్యేలను కించపరుస్తూ మాట్లాడడాన్ని ఖండిస్తూ సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కడ్తాల్ మండల కేంద్రంలో రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్ మాట్లాడుతూ బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర తొలి విద్యాశాఖ మంత్రి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ శాసనసభ్యురాలు అని చూడకుండా అవమానపరిచే వాక్యాలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళా ఎమ్మెల్యేలకు సముచిత స్థానం కల్పించి మహిళా సాధికారిత కార్యక్రమాలు గత



ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బేషరతుగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సువాలి, తులసి రామ్ నాయక్, నరసింహా, వెంకటేష్, ప్రియా రమేష్, మంజుల చంద్రమౌళి, మంగళపల్లి నరసింహా, చందర్ శ్రీను, మల్లేష్, సాయి, అంజి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాదిగ**

**విశ్వంభర, చింతపల్లి/ఆత్మకూరు(ఎం)/ :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వింజమూరి కృష్ణ మాదిగ అన్నారు. అనంతరం చింతపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టులో గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. యాబై ఏళ్ల సుదీర్ఘ సమస్యకు నేడు పరిష్కారం లభించిందన్నారు. ఎందరో మహానుభావుల త్యాగాలకు గౌరవం దక్కి, దశాబ్దాల కల నెరవేరిందన్నారు. దళితులందరకీ ఇది గొప్ప పండుగ రోజన్నారు. భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఏసు మాదిగ, వింజమూరు రవి, ఆరెకంటి రాధాకృష్ణ, కృష్ణయ్య, ఎలిమినేటి నరసింహ, నల్ల శంకర్, ఎర్ర వెంకటయ్య, ముదిగొండ మొగిలయ్య, ఊరే భాస్కర్, ఆంజనేయులు, ఏర్పుల దవలయ్య, ఏర్పుల జంగయ్య, జగన్, సైదులు, వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ ఉప కులాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



- యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ళ గ్రామంలో సుప్రీంకోర్టు తీర్పుపై సంతోషం వ్యక్తం చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి టపాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరెళ్ళరమేష్ మాదిగ మాట్లాడుతూ ఈ వర్గీకరణ సాధనకు30 సంవత్సరాలుగా ఎన్నో కష్టనష్టాలకు ఓర్చిఎన్నో అవంతరాలను ఎదుర్కొని సాగిన ఎమ్మార్పీఎస్ పోరాటంలో ఎంతో మంది అమరులు కావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు నార్కట్పల్లి సహదేవ్, తుమ్మలగూడెం సాయి కిరణ్, గడ్డం సురేష్, ఉప్పల సాయి, ఎల్లంకి శంకర్, కూరెళ్ళ మచ్చగిరి, రాంపాక ఉపేందర్, కూరెళ్ల మచ్చగిరి, కూరెళ్ళ స్వామి, తుమ్మలగూడెం రంగయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా సుశృత గ్రామీణ వైద్యుల సంఘం ఎక్జిక్యూటీవ్ మెంబర్ సుదగాని లక్ష్మయ్య గౌడ్, నార్కట్పల్లి సోమయ్య, జోగు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.
- ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఆదేశాల మేరకు మేడి పాపయ్య నాయకత్వంలో 30 సంవత్సరాలు ఏబిసిడి వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందుకు ఆరుగురు జడ్జిలకు జిల్లా నాయకుడు కుమ్మరి కుంట్ల గణేష్ మాదిగ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మేడి శ్రీనివాస్ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ జిల్లా నాయకులు వస్తుప్పల స్వామి మాదిగ, వస్తుప్పల ఎల్లయ్య మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ మండల అధ్యక్షులు కదిరే నవీన్ మాదిగ, మాజీ మండల అధ్యక్షులు పంది రవీందర్ మాదిగ, మండల నాయకులు గట్టు శంకర్, కదిరి దశరథ, పోలేపాక సుశీల, గంగారం చంద్రయ్య, సంఘపాక స్వామి, సీనియర్ నాయకులు మేడి బాలకృష్ణ, మేడి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్ (ఎం) మండలంలో ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడంతో ఆత్మకూర్ (ఎం ) మండల కేంద్రంలోని భువనగిరి - మోత్కూర్ రహదారి వద్ద ఎమ్మార్పిఎస్ రాష్ట్ర నాయకుడు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ ఆధ్వర్యంలో టపాకులు కాల్చి, స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకణ ద్వారా అన్నీ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పిఎస్‌ను 1994 లో ఏర్పాటుచేసి ముప్పై ఏళ్లుగా సబ్బండ వర్గాల సహకారంతో అలుపెరుగని పోరాటం చేశారని ఈ పోరాటంలో ఎందరో మాదిగ బిడ్డలు ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి సుప్రీం ధర్మాసనానికి అనుకూలంగా నివేదిక ఇవ్వడంలో ప్రధాన భూమిక పోషించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ, హెూమ్ మంత్రి అమిత్ షాలకు,మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు, వర్గీకరణ అమలు తక్షణమే చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు ఈ తీర్పు ద్వారా దీనికి సహకరించిన సబ్బండ వర్గాల ప్రజలకు ప్రజాస్వామిక వాదులకు ప్రతీ ఒక్కరికి పేరు, పేరునా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పియస్, ఎంఎస్పీ నాయకులు గట్టు రాములు మాదిగ, మందుల లింగ స్వామి మాదిగ, యం యస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలరాజు మాదిగ, జూబ్లీహిల్స్ మహేష్ మాదిగ, సీనియర్ నాయకులు మందుల ఈసాక్ మాదిగ, సుంచు శ్రీనివాస్ మాదిగ, గట్టు జ్ఞానేశ్వర్ మాదిగ, గట్టు శ్రీరాములు మాదిగ, గంధమల్ల రమేష్ మాదిగ, యంఈఎఫ్ నాయకులు ఆడెపు భిక్షపతిమాదిగ, యూత్ నాయకులు గట్టు విజయ్ మాదిగ, బొడ్డు ప్రభాకర్, సూరారం నవీన్, గట్టు అజయ్, దుప్పెల్లి రాకేష్ మాదిగ పాల్గొన్నారు.





# చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరం

**అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**



**విశ్వంభర, భూపాలపల్లి :** చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరమని, అప్పుడే పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు పట్టించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వందపడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ తో కలిసి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలిం తలు, డాక్టర్లు, స్టాఫ్ నర్స్ లకు తల్లిపాలను పట్టిం చడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపా రు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోను, ప్రతీ అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించి బిడ్డలకు ముర్రు పాలు పట్టించడం వల్ల కలిగే ప్రయోజనాలపై బాలింతలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల రోగనిరోధక పెరుగుతుందని, చిన్నారులకు కచ్చితంగా ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలని, తర్వాత తల్లి పాలతో పాటు అదనంగా నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తల ద్వారా గ్రామ స్థాయిలో బాలింతలకు తల్లి పాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ నవీన్, పీఓ ఎంహెచ్ఎన్ శ్రీదేవి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# 30 సంవత్సరాల పోరాటం నరేంద్ర మోడీతో సాకారమైంది





**విశ్వంభర, నారాయణఖేడ్ :** ఎస్సీ ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల పెద్ద శంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం పెద్ద శంకరంపేట లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 సంవత్సరాల నుండి మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పలుమార్లు విన్నవించడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీ దృష్ట్యా ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఆయన వివరించారు. ఎస్సీల వర్గీకరణ 30 సంవత్సరాల పోరాటం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో సాకారమైందని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఏడుగురు సభ్యులతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వర్గీకరణ పై కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమీషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈరోజు వర్గీకరణకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయని వివరించారు. గత 30 సంవత్సరాలుగా వర్గీకరణపై పోరాడుతున్న ప్రతి ఒక్కరు ఈరోజు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, మాజీ సర్పంచులు, సూర్యప్రకాష్, అశోక్, శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ, శ్రీహరి, బుగుడాల కృష్ణ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలు దగ్ధం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై దుష్ప్రచారాలను చేసిన బీఆర్ఎస్ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అబద్ధపు వ్యాఖ్యలకు నిరసనగా ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ మందు విజయవాడ జాతీయ రహదారిపై కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిల దిష్టిబొమ్మల దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పైన అసత్య ప్రచారాలను చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, బండి మధుసూధన్ రావు, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మీ, రేణుక, తలాటి రమేష్ నేత, వంగూరి యాదవ రెడ్డి, డక్కీయర్, జ్ఞానేశ్వర్ యాదవ్, దుబ్బాక శేఖర్, పెద్దవూర సైదులు, పగిల భూపాల్ రెడ్డి, లింగ స్వామి గౌడ్, పగడాల ఎల్లన్న, శ్రీకాంత్ రెడ్డి, సంతోష, మాధవి, శ్వేత పాల్గొన్నారు.

### కరేబియన్ లీగ్‌కి ఎంపికవ్వడం
## హైదరాబాద్‌కి గర్వకారణం

- హెచ్సీఏ నుంచి ఎంపికైన తొలి క్రీడాకారిణి ప్రణవి చంద్ర
- అభినందించిన హెచ్సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వర్ నాథ్



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రపంచవ్యాప్తంగా పేరొందిన మహిళా కరేబియన్ లీగ్ లో ఈసారి ఆడడానికి ఇండియా నుంచి ముగ్గురు మహిళా క్రీడాకారిణిలు ఎంపిక్వగా అందులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కి చెందిన క్రికెటర్ ప్రణవి చంద్రకూడా ఎంపికయింది. హైదరాబాద్ నుంచి ఈ లీగ్ కి ఎంపికయిన తొలి క్రికెటర్ ప్రణవి చంద్ర కావడం గర్వించ దగ్గ విషయమని జగన్ మోహన్ రావు అన్నారు. బిసిసిఐ స్వదేశీ క్రికెటర్లను అనుమతించిన మూడు ప్రీమియర్ లీగ్ లలో ఈ కరేబియన్ ప్రీమియర్ లీగ్ కూడా ఒకటి కాగా, మిగతా రెండు డబ్ల్యూపీఎల్, బిగ్ బాష్ లీగ్ అని అలాంటి ప్రతిష్టాత్మక లీగ్ లో ప్రణవి భాగకావం పట్ల జగన్ మోహన్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిశనపల్లి జగన్ మోహన్‌రావు, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ ఛాముండేశ్వర్ నాథ్ ప్రణవి చంద్ర ని సత్కరించి, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ లీగ్ కి ఎంపికయినందుకు అభినందనలు తెలిపారు.

### ఇక రాజకీయ అధికారం వైపు
## మాదిగలు పోరాటం చేయాలి

### ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ పిలుపు



**విశ్వంభర, హైదరాబాద్ :** ఇది దక్షిణాదిలోని మూడు కోట్ల మాదిగల విజయం మని, ఇక రాజకీయ అధికారం వైపు మాదిగల పోరాటం చేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు ఆర్థిక ప్రాతిపదికన తీర్పు ఇవ్వడం పేద మాదిగ ఉపకులాలకు, మాల ఉప కులాలకు మేలు చేస్తుందని ఇది దక్షిణాదిలోని మూడు కోట్ల మంది మాదిగల ప్రజల పోరాట ఫలితం అని మాదిగ అమరవీరులకు ఈ తీర్పును అంకితం ఇస్తున్నామని ఇక నుండి మాదిగలు రాజకీయ అధికారం వైపు పోరాటం సాగించాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ పిలుపు ఇచ్చారు. గురువారం తార్నాకలోని తన కార్యాలయంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మాతంగి ఓదెలు మాదిగ, నంద్రు నరసింహ మాదిగ నాయుడు తదితర మాదిగ ఉద్యమ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ నుండి గల్లీ వరకు పోరాటం చేసిన, దక్షిణాదిలోని మూడు కోట్ల మంది మాదిగ వీరుల కు ఉద్యమానికి సహకరించిన, అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజా, కుల సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. చివరికి న్యాయమే గెలిచిందని, అయితే మాదిగలకు ఇది కేవలం పాక్షిక విజయమేనని అంతిమ పోరాటం రాజకీయ అధికారమని ఆ దిశగా మాదిగలు సంఘాలకు అతీతంగా ఒక్కటై దక్షిణాదిలో రాజ్యాధికారాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.



### రజక సంఘం సభ్యులకు
## మేయర్ కోలన్ నీలా భరోసా

**హైదాబాద్, విశ్వంభర :** మేయర్ శ్రీమతి శ్రీ కోలన్ నీలా గోపాల్ రెడ్డి గారిని, సీనియర్ నాయకులు శ్రీ కోలన్ గోపాల్ రెడ్డిని నిజాంపేట్ రజక సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి కేటాయించబడిన దోభి ఘాట్ వద్ద ఫెన్సింగ్, ఇతర సదుపాయాల ఏర్పాటు కొరకు కృషి చేయగలరని కోరారు. ఈ సందర్భంగా మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఎన్.ఎం.సీ అధికారులతో చర్చించి ధోభి ఘాట్ వద్ద తగిన సదుపాయాల ఏర్పాట్లకు కృషి చేస్తామని తెలిపారు.

## సీఎం రేవంత్‌ని కలిసిన మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



**విశ్వంభర, హైదరాబాద్ :** భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధి, భద్రాచలం కరకట్ట నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయవలసిందిగా అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం. వెంకటేశ్వర్లు కలిశారు. ప్రతి సంవత్సరం గోదావరి వరదల కారణంగా భద్రాచలం పట్టణం, చుట్టు పక్కల గ్రామాలు ముంపుకు గురి అవుతున్నాయని, ఈ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం గోదావరికి ఇరువైపులా కరకట్ట నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం వద్ద గోదావరి నదికి ఇరువైపులా కరకట్ట నిర్మాణం కోసం 4,000 కోట్ల త్వరలోనే మంజూరు చేస్తాం అన్నారు.

### మహిళా కళాశాలలో
## డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

**హైదరాబాద్ , ఆగస్టు 1:** హైదరాబాద్ లోని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ స్టడీ సెంటర్ లో మహిళా విద్యార్థినుల డిగ్రీ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ మారోజు రామాచారి గురువారం తెలిపారు. వివిధ డిగ్రీ కోర్సుల అడ్మిషన్లకు ఇంటర్మీడియట్ పూర్తయిన లేక ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. దూర విద్య(డిస్టెన్స్ ఎడ్యుకేషన్) ద్వారా చదువుకోవాలనుకునే వారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ) డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిందని అన్నారు. 2024 – 25 అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలకు కావాల్సిన అర్హతలు దరఖాస్తు వివరాలు, ముఖ్యమైన తేదీలను యూనివర్సిటీ వెల్లడించిందని చెప్పారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సు లలో ప్రవేశాలకు అంతకు ముందు విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు పొందిన వారు రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరానికి ట్యూషన్ ఫీజును, అంతకు ముందు చేరిన విద్యార్థుల్లో సకాలంలో చెల్లించలేక పోయిన వారు ఆగస్టు 18 వతేదీ వరకు చెల్లించుకోవచ్చని ఆయన తెలిపారు.

### సీఎం రేవంత్ రెడ్డి
## దిష్టిబొమ్మ దగ్ధం



**విశ్వంభర, కూకట్‌పల్లి :** మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరుని బీఆర్ఎస్ నాయకులు ఖండిస్తూ గురువారం కూకట్ పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపుమేరకు బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బాల్ నగర్ లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ రాష్ట్ర సీఎం మహిళలకు గౌరవం ఇవ్వకపోవడం ప్రభుత్వా నికి మంచి ది కాదని, మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలల్లో అభివృద్ధి శూన్యమని, ఎదుటి పార్టీలపై ఏడవటం తప్ప చేసింది ఏం లేదని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగడాల శిరీష బాబు రావు, ఆవుల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విశ్వంభరా, ఎల్బీనగర్ :** మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు సబితా ఇంద్రా రెడ్డి మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వాక్యాలకు నిరసనగా ఆర్కే పరం డివిజన్ బీఆర్ఎస్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్ గుప్తా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శ్యాం సుందర్ గుప్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి హెూదాలో ఉండి గౌరవమైన స్థానాన్ని పొంది సంస్కార రహితంగా ప్రవర్తించడం సబబు కాదని, ముందు మహిళలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతినిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరగాకుండా పనిచేస్తున్న సబితా ఇంద్రారెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీ.అర్.ఎస్.వీ అధ్యక్షుడు పగడాల దీపక్, మైనార్టీ నాయకుడు రహీం, శ్రీనాథ్ యాదవ్, లోకి, హరీష్, నరేందర్, గని తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణలో ఐదు రోజులపాటు
## భారీ వర్షాలు



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో రాగల నాలుగైదు రోజుల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. రాగల మూడురోజుల్లో స్థిరమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లు వీచే అవకాశం ఉందని చెప్పింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో గాలులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని తెలిపింది. గురువారం నుంచి శుక్రవారం వరకు పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొంది. ఆగస్టు 3న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. అలాగే, ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.



## చంద్రశేఖర్ గౌడ్‌కు డాక్టరేట్

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ మేడిపల్లి కి చెందిన సి.హెచ్. చంద్రశేఖర్ గౌడ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ డిగ్రీని ప్రకటించింది. డాక్టర్ ఎం.ఆర్ మురళీ ప్రసాద్ పర్యవేక్షణలో స్ట్రక్చరల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ అకడమిక్ లైబ్రరీస్ ఇన్ తెలంగాణ అనే అంశంపై చంద్రశేఖర్ గౌడ్ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించగా డాక్టరేట్ లభించినట్టు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి విడుదల చేసిన పత్రికా ప్రకటన లో తెలిపారు. డాక్టరేట్ పొందిన చంద్రశేఖర్ గౌడ్ కు గురువారం విశ్వ విద్యాలయ ఆచార్యులు, పరిశోధకులు, బంధు మిత్రులు అభినందనలు తెలిపారు.

### ప్రజల అవసరాల మేరకే
# తపాలా పొదుపు పథకాలు



**విశ్వంభర, నారాయణఖేడ్ :** ప్రజల అవసరాలకు అనుగుణంగానే తపాల శాఖలో మంచి పొదుపు పథకాలు ఉన్నాయని వీటిని ప్రజలు సద్వినియోగం పరుచుకోవాలని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్వీ మురళి కుమార్ సూచించారు. గురువారం సంగారెడ్డి డివిజన్ పరిధిలోని టెంకటి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ ను పోస్టల్ ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోస్టల్ ఎస్పీ మాట్లాడుతూ తపాల శాఖలో కుటుంబానికి భరోసానిచ్చే మంచి పొదుపు, బీమా పథకాలు ఉన్నాయని అన్నారు. గ్రూప్ ఆక్సిడెంట్ గార్డ్ పాలసీలను ప్రతి ఒక్కరు తప్పకుండా తీసుకోవాలని ఆయన కోరారు. వార్షిక ప్రీమియం 555/-, 755/- ఒకసారి చెల్లిస్తే సంవత్సరం వరకు 10, 15 లక్షల యాక్సిడెంట్ రిస్క్ కవరేజీ బీమా ఉంటుందని తెలిపారు. అలాగే సేవింగ్, రికరింగ్, సుకన్య సమృద్ధి అకౌంట్, గ్రామీణ తపాలా జీవిత బీమా వంటి మంచి పథకాలు ఉన్నాయని ఎస్పీ వివరించారు. తపాల ఉద్యోగులు కూడా రోజు సమయపాలన పాటించి గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తిరిగి పోస్టల్ పథకాలు ప్రజలకు వివరించి వారు వివిధ స్కీమ్ లలో చేరేలా కృషి చేయాలని సూచించారు. డైరెక్టరేట్ ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రతి ఒక్క డ్రైవ్‌ను తపాలా ఉద్యోగులు అందరు తప్పనిసరిగా ఇచ్చిన టార్గెట్ లను పూర్తి చేసి ప్రత్యేక డ్రైవ్ లను విజయవంతం చేయాలని కోరారు. పోస్టల్ ఎస్పీ వెంట టెంకటి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ విజయ్ కుమార్, ఏబీపీఎం, మురళి ఉన్నారు.



### ప్రజల అవసరాల మేరకే
# తపాలా పొదుపు పథకాలు

**విశ్వంభర, నారాయణఖేడ్ :** ప్రజల అవసరాలకు అనుగుణంగానే తపాల శాఖలో మంచి పొదుపు పథకాలు ఉన్నాయని వీటిని ప్రజలు సద్వినియోగం పరుచుకోవాలని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్వీ మురళి కుమార్ సూచించారు. గురువారం సంగారెడ్డి డివిజన్ పరిధిలోని టెంకటి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ ను పోస్టల్ ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోస్టల్ ఎస్పీ మాట్లాడుతూ తపాల శాఖలో కుటుంబానికి భరోసానిచ్చే మంచి పొదుపు, బీమా పథకాలు ఉన్నాయని అన్నారు. గ్రూప్ ఆక్సిడెంట్ గార్డ్ పాలసీలను ప్రతి ఒక్కరు తప్పకుండా తీసుకోవాలని ఆయన కోరారు. వార్షిక ప్రీమియం 555/-, 755/- ఒకసారి చెల్లిస్తే సంవత్సరం వరకు 10, 15 లక్షల యాక్సిడెంట్ రిస్క్ కవరేజీ బీమా ఉంటుందని తెలిపారు. అలాగే సేవింగ్, రికరింగ్, సుకన్య సమృద్ధి అకౌంట్, గ్రామీణ తపాలా జీవిత బీమా వంటి మంచి పథకాలు ఉన్నాయని ఎస్పీ వివరించారు. తపాల ఉద్యోగులు కూడా రోజు సమయపాలన పాటించి గ్రామీణ ప్రాంతాల లోని ప్రతి ఇంటికి తిరిగి పోస్టల్ పథకాలు ప్రజలకు వివరించి వారు వివిధ స్కీమ్ లలో చేరేలా కృషి చేయాలని సూచించారు. డైరెక్టరేట్ ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రతి ఒక్క డ్రైవ్ ను తపాలా ఉద్యోగులు అందరు తప్పనిసరిగా ఇచ్చిన టార్గెట్ లను పూర్తి చేసి ప్రత్యేక డ్రైవ్ లను విజయవంతం చేయాలని కోరారు. పోస్టల్ ఎస్పీ వెంట టెంకటి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ విజయ్ కుమార్, ఏబీపీఎం, మురళి ఉన్నారు.



# ధ్రువీకరణ పత్రాలులేని వాహనాలు సీజ్

### అల్లాదుర్గం సీఐ రేణుక

**విశ్వంభర, నారాయణఖేడ్ :** డాక్యుమెంట్ లేని వాహనాలు రహదారుల పైకి వస్తే సీజ్ చేస్తామని అల్లాదుర్గం సీఐ రేణుక అన్నారు. గురువారం పెద్ద శంకరంపేట రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సూచనల మేరకు, మెదక్ జిల్లా క్యూఆర్టీ సిబ్బంది శంకరంపేట పిఎస్ సిబ్బంది తో మార్కెట్లో స్పెషల్ డ్రైవ్ లో భాగంగా వాహనాల తనిఖీ చేస్తూ డాక్యుమెంట్లు లేని వాహనాలు, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు మార్కెట్లో తరచు సెల్ఫోన్లో చోరీలు అవుతున్నా యని అందుకే మార్కెట్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ పాల్గొన్నారు.

### గ్రామ అభివృద్ధిలో
# కార్యదర్శుల పాత్ర గొప్పది



**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి కడ్తాల్ మండలం కార్కల్ పహాడ్‌కు బదిలీ అయిన జంగయ్య ని, మొయినాబాద్ మండలం మేడిపల్లి నుంచి కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి మురళీని ఆ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం గురువారం నాడు సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, గ్రామ అభివృద్ధికి కార్యదర్శుల పాత్రనే ఎక్కువగా ఉంటుందని ఎక్కడైనా అతున్నత సేవలు అందించి ప్రజల మెప్పు పొందాలని అన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ కృష్ణయ్య, భిక్షపతి, శ్రీను, రమేష్, ఆంజనేయులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం
# ప్రతిపక్ష పాత్ర పోషిస్తా

- పాలకులు స్పందించకపోవడం బాధాకరం
- ఓట్ల కోసం కాదు ప్రజల కోసం పనిచేసేవాడే నాయకుడు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**విశ్వంభర, కాటారం :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం బోర్లగూడెంలో గత నాలుగు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్గమైన బతుకయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయి నిరాశ్రయుడైన బతుకయ్య కుటుంబాన్ని స్థానిక పాలకులు, అధికారులు పరామర్శించకపోవడం విడ్డూరమన్నారు. పొట్టకూటి కోసం కులవృత్తిని నమ్ముకుని బోర్లగూడెం గ్రామంలో ఉపాధి పొందుతున్న బతుకయ్య నాలుగు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో పని ముట్లు, యంత్రాలతో పాటు సర్వం కోల్పోయి సుమారు రూ.10లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఇప్పటి వరకు అధికారులు వచ్చి కనీసం విచారణ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆయన విమర్శించారు. ఉపాధితో పాటు సర్వం కోల్పోయిన బతుకయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఇప్పటి వరకు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఎవరూ రాకపోవడంతో బతుకయ్య స్వయంగా తనకు ఫోన్ చేసి మీ ద్వారానైనా ప్రభుత్వానికి తన గోడు తెలియాలని కోరారని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులవృత్తులను ప్రోత్సహిస్తున్నామని చెబుతున్నారే కానీ ఇలాంటి వారికి కనీసం సాయం అందించడంలేదన్నారు. అగ్ని ప్రమాదంతో ఆస్తినష్టం జరిగి సర్వం కోల్పోయి ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న బతుకయ్య కుటుంబానికి సాయం చేయాలనే ఆలోచన స్థానిక నాయకులకు, ఎమ్మెల్యేకు రాకపోవడం బాధాకరమన్నారు. అక్రమ దందాలను ప్రోత్సహిస్తూ కమీషన్‌లు తీసుకుంటున్న స్థానిక పాలకులు ఇలాంటి పేదల కోసం ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓట్ల కోసమే కాకుండా ప్రజల కోసమే పనిచేసే వాడే నిజమైన నాయకుడని, స్థానిక ఎమ్మెల్యే కేవలం ఓట్ల కోసం మాత్రమే చూస్తున్నాడే తప్ప ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. తాను స్థానికంగా లేకపోవడంతో ఆలస్యం అయిందని, తనకు తెలిసిన వెంటనే బతుకయ్య కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పినట్లు ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బతుకయ్య కుటుంబానికి న్యాయం చేస్తామని అన్నారు. బతుకయ్య కుటుంబానికి అండగా నిలిచి ప్రభుత్వ పరంగా సాయం అందించేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

### గ్రామంలోకి కొత్త వారు వస్తే
# పోలీసులకి సమాచారం అందించాలి



**విశ్వంభర, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ లో భాగంగా ఈరోజు పలిమెల మండలలోని సర్వాయిపేట గ్రామంను పలిమెల ఎస్ఐ తమాషా రెడ్డి సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలిమెల ఎస్ఐ మాట్లాడుతూ కొత్త వారిని గానీ, అనుమానాస్పద వ్యక్తులను గోదావరి దాటించవద్దని, కొత్త వారి సమాచారం తప్పకుండా పోలీస్ వారికి అందించాలని సూచించారు. అలాగే మావోయిస్టుల దుశ్చర్యల గురించి వివరిస్తూ వారికి సహాయం చేయడం ఆశ్రయం ఇవ్వడం చట్టరీత్య నేరం అని, వాటికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోకి కొత్త వారు ఎవరైనా వస్తే వెంటనే పోలీస్ లకి సమాచారం అందించాలని తెలిపారు. గుడుంబాకు బానిస అయ్యి జీవితాలను నాశనం చేసుకోవద్దు అని, గుడుంబా అమ్మిన తయారు చేసిన సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ విషయం లో ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పలిమెల ఎస్ఐ తమాషా రెడ్డి తో పాటు మహదేవ్‌పూర్ ఎస్ఐ పవన్ కుమార్, సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

### తెగి పడిన 11 కేవీ విద్యుత్ వైర్లు
# గృహోపకరణాలు దగ్ధం



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లులోని భారత్ పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లు గురువారం తెగి ఎల్ టి వైర్ల మీద పడడంతో పలు ఇళ్లలో గృహోపకరణాలు, వస్తువులు పూర్తిగా దగ్ధమై ఆస్తి నష్టం జరిగింది. ఇళ్లలో ఉండే టీవీలు, ఫ్యాన్లు, బోరు మోటర్లు, విద్యుత్ బల్బులు తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. దీంతో బాధితులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణ హరిత దినోత్సవం



**విశ్వంభర కరీంనగర్ :** కరీంనగర్ ఎస్టీ. జాన్స్ స్కూల్ లో పర్యావరణ పరిరక్షణ పట్ల తన నిబద్ధతను పటిష్టం చేస్తూ హరిత దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంతో జరుపుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సంఘం సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. ప్రాంగణంలో చుట్టుపక్కల 100 మొక్కలను నాటారు, ఇది అటవీ పెంపకం యొక్క ప్రాముఖ్యతను సూచిస్తుందని తెలిపారు. పాల్గొనేవారు తమ దైనందిన జీవితంలో పర్యావరణ అనుకూల అలవాట్లను అలవర్చుకుంటామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సిస్టర్ ఇనాలు మాట్లాడుతూ, గ్రీన్ డే అనేది భూగ్రహం పట్ల మన బాధ్యతను గుర్తుచేస్తుంది. పరిశుభ్రమైన, పచ్చని భవిష్యత్తును నిర్ధారించడానికి మనం తగ్గించడానికి, పునర్వినియోగానికి, రీసైకిల్ చేయడానికి కృషి చేయాలి అన్నారు. పోస్టర్ తయారీ పోటీ, పర్యావరణ పరిరక్షణపై స్కిట్‌తో వేడుక ముగిసిందని, పాల్గొనేవారి సృజనాత్మకత, ఉత్సాహాన్ని ప్రదర్శిస్తుందని తెలిపారు.



### లేక్ వ్యూ విల్లాస్ లో
### పాదయాత్ర చేసిన కార్పొరేటర్

**విశ్వంభర, కూకట్‌పల్లి :** హైదర్ నగర్ డివిజన్లోని లేక్ వ్యూ విల్లాస్ లో గురువారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. స్థానికులను సమస్యల గురించి అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లోని కాలనీలను అభివృద్ధి చేసేది లక్ష్యంగా పనిచేస్తానని, స్థానికంగా ఉన్న వారిని సమస్యలు అడిగి తెలుసుకోవడం వలన ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అభివృద్ధి చేయొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, మాధవరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఎస్టిమేట్ కాపీకి ఎంబీకి
### తేడా తెలియని అధికారులు

**విశ్వంభర, కరీంనగర్ :** మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎస్టిమేట్ కాపీకి మేజర్మెంట్ బుక్ ఎంబీకి తేడా తెలియకుండా పోయింది. కిసాన్ నగర్ సమీకృత మార్కెట్ కు సంబంధించి రాక్ కటింగ్ పేరుతో రూ 80 లక్షలు బిల్లులు కొల్లగొట్టిన అధికారులు, కాంట్రాక్టర్లు చేయడమే కాకుండా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ బదిలీపై వెలుతున్న ఓ అధికారితో బలవంతంగా ప్రెస్‌నోట్ రిలీజ్ చేయించారు. ఇందులో రూ.80 లక్షల బిల్లులు చెల్లించారనేది తప్పుడు ఆరోపన అంటు రూ. 1,99,468 లతో తయారు చేసిన ఎస్టిమేట్ కాపీని చూపించడం విస్మయానికి గురిచేస్తుంది. గత మూడు నెలల నుండి సమాచార హక్కు చట్టం కింద ఎంబీ వివరాల కోసం దరఖాస్తు చేసినప్పటికీ అధికారులు దానికి సమాదానం చెప్పకుండా దాటవేస్తూ వస్తున్నారు. అయితే ఈ అక్రమాల వ్యవహారంలో కాంట్రాక్టర్ ను అధికారులు కాపాడుతున్నారా, అధికారులను ప్రజాప్రతినిధులు కాపాడుతున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. సాక్షాత్తు కార్పొరేషన్ కమిషనరే ఎంబీ బుక్‌పై ఆరా తీస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల బిల్లుల్లో అవకతవకలు జరిగినది వాస్తవమే అని తెలుస్తోంది కానీ అవకతవకలు జరగలేదని అధికారులు చెబుతున్నప్పుడు ఎంబీ బుక్ నెం. 152 ఎక్కడ ఉన్నదనే విషయాన్ని బహిర్గత పరచకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే సీడీఎంఏకు జిల్లా కలెక్టర్కు విజిలెన్స్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఎంబి బుక్ మాయం అయిన విషయంలో కమిషనర్ దృష్టి సారించి విజిలెన్స్ విచారణ వేగవంతం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విచారణలో దోషులుగా చేరిన అధికారులు, కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని 42వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్ అధికారులను కోరుతున్నామని అన్నారు.



## కృష్ణ జన్మభూమి కేసులో
# అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు..!

**అలహాబాద్:** ఉత్తర్ ప్రదేశ్ లోని మధురలో ఉన్న దశాబ్దాల నాటికి శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా వివాదంలో అలహాబాద్ హైకోర్టు గురువారం మరో కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో షాహీ ఈద్గాను కృష్ణజన్మభూమిలో కొంతభాగం కూల్చి కట్టారని ఆరోపిస్తూ హిందూపక్షం దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హతను ప్రశ్నిస్తూ ముస్లిం పక్షం దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు హైకోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు హిందూ పక్షం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కొనసాగుతుందని ప్రకటించింది. కృష్ణజన్మభూమిలో కొంతభాగం కూల్చి మధురలో షాహీ మసీదు నిర్మించినందున ఆ స్థలం తమకు అప్పగించాలంటూ హిందూ పక్షం నుంచి దాఖలైన 18 పిటిషన్లపై విచారణ చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మసీదు కమిటీ పిటిషన్ దాఖలు చేసింది. ఇందులో 1991 నాటి ప్రార్ధనా స్థలాల చట్టంతో పాటు పలు చట్టాలను ముస్లిం పక్షం ప్రస్తావించింది. స్వాతంత్రానికి పూర్వం నిర్మించిన కట్టడాలను ధ్వంసం చేయరాదని వాదించింది. అయితే అలహాబాద్ హైకోర్టులో సింగిల్ జడ్జి మాయాంక్ కుమార్ జైన్ మాత్రం ఈ వాదనలతో విభేదించారు. గురువారం ముస్లిం పక్షం పిటిషన్‌ను కొట్టేసిన అలహాబాద్ హైకోర్టు హిందూపక్షం దాఖలు చేసిన 18 పిటిషన్లపై విచారణ కొనసాగింపుకు అనుమతి ఇచ్చారు. ఇప్పటికే మధుర స్థానిక కోర్టు షాహీ ఈద్గా మసీదు స్థలంలో సర్వేకు కూడా అనుమతి ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ముస్లిం పక్షం దాఖలు చేసిన పిటిషన్ ను అలహాబాద్ హైకోర్టు కొట్టేయడంతో ఇది కూడా కొనసాగనుంది. దీనిపై ముస్లిం పక్షం అలహాబాద్ హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించనుంది.



## 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలు
# అసెంబ్లీ నుంచి సస్పెండ్

**బయటకు తీసుకెళ్లిన మార్షల్స్**

**రాంచీ:** బీజేపీకి చెందిన 18 మంది ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారు. సభ నుంచి వెళ్లేందుకు ఆ ఎమ్మెల్యేలు నిరాకరించారు. దీంతో మార్షల్స్ బలవంతంగా వారిని అసెంబ్లీ నుంచి బయటకు తీసుకెళ్లారు. జారండ్‌లో ఈ సంఘటన జరిగింది. పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు బుధవారం అసెంబ్లీలో నిరసనకు దిగారు. పలు కీలక సమస్యలపై ప్రశ్నలకు సీఎం హేమంత్ సోరెన్ సమాధానం ఇచ్చేందుకు నిరాకరించడంతో సభలో గందరగోళం సృష్టించారు. ఈ నేపథ్యంలో మార్షల్స్ ద్వారా వారిని బయటకు పంపారు. దీనికి నిరసనగా బీజేపీ ఎమ్మెల్యేలు బుధవారం రాత్రి అసెంబ్లీ లాబీలోనే నిద్రించారు. కాగా, గురువారం అసెంబ్లీ ప్రారంభం కాకముందు బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లారు. సీఎం హేమంత్ సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కొన్ని పత్రాలను చించివేశారు. దీంతో సభ ప్రారంభానికి ముందు అధికార, ప్రతిపక్ష సభ్యులు వాగ్వాదానికి దిగారు. సభలో గందరగోళ పరిస్థితి కొనసాగడంతో స్పీకర్ రవీంద్ర నాథ్ మహతో చర్యలు చేపట్టారు. 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకు సస్పెండ్ చేశారు. అయితే వారు సభ నుంచి బయటకు వెళ్లేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యేలను మార్షల్స్ బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. మరోవైపు అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేల తీరుపై ఎథిక్స్ కమిటీ విచారణ జరుపుతుందని, వారం రోజుల్లో నివేదికను తనకు అందజేస్తుందని స్పీకర్ వెల్లడించారు. అయితే జారండ్‌లో నియంతృత్వం సాగుతోందని ప్రతిపక్ష నేత అమర్ బౌరీ ఆరోపించారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని ఆయన అన్నారు. జారండ్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాదిలో జరుగనున్నాయి.

# ఆగస్ట్ 6న ఫస్ట్ క్రై ఐపీఓ..!

**విశ్వంభర, బిజినెస్:** ఓమ్నిఛానల్ రిటైల్ సంస్థను నిర్వహిస్తున్న బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ సెబీకి రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. డీఆర్హెచ్పీ ప్రకారం ఫస్ట్‌క్రై ఐపీఓ తీసుకురానున్నారు. ఈ కంపెనీ ఎఫ్వై24లో నిర్వహణ ఆదాయంలో 15% వృద్ధిని నమోదు చేసి రూ. 6,481 కోట్లకు చేరుకుంది. అదే సమయంలో నష్టాలను 34% తగ్గించి రూ. 321 కోట్లకు చేరుకుంది. ఇ-కామర్స్ రోల్-అప్ అనుబంధ సంస్థ-రూ. 1,209 కోట్ల ఆదాయాన్ని నివేదించింది. ఫస్ట్‌క్రై అంతర్జాతీయ వ్యాపారం-మిడిల్ ఈస్ట్-దేశీయ కార్యకలాపాల కంటే వేగంగా వృద్ధిని సాధిస్తోంది. దీని మాతృ సంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ 70% ఆదాయం భారతదేశం నుంచి వస్తుంది. 30 శాతం ఆదాయం మిగతా దేశాల నుంచి వస్తుంది. ఫస్ట్‌క్రై అంతర్జాతీయ వ్యాపారం రూ. 753 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 50% పైగా వృద్ధి చెందింది. ఐపీఓ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎక్కువ భాగాన్ని సౌదీ అరేబియాలో విస్తరణ కోసం ఉపయోగించనున్నారు. కంపెనీ ఏప్రిల్‌లో సవరించిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్ హెచ్పీ) లో




పేర్కొంది. పూణేకు చెందిన ఫస్ట్‌క్రై ఈ వారం తుది ఐపివో పత్రాలను దాఖలు చేయనుంది. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ కానుంది ఈ కంపెనీ. సాఫ్ట్‌బ్యాంక్, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్-ఆధారిత సంస్థ పెట్టుబడిదారులు, సంస్థ వ్యవస్థాపకుల నుండి 54 మిలియన్ షేర్లకు ఆఫర్-ఫర్-సేల్‌తో పాటు ప్రాథమిక నిధుల సేకరణ ద్వారా 217 మిలియన్లను (రూ. 1,816 కోట్లు) సేకరించే అవకాశం ఉంది. సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, మహీంద్రా రిటైల్, టీపీజీ గ్రోత్, ఇతరులు ఓఎఫ్ఎస్ ద్వారా పార్ట్-డివెస్ట్ చేయనున్నారు.

## ఎన్నుకునేందుకు లేని అర్హత
# పోటీకెందుకు..?

- ఎన్నికల్లో పోటీచేసే వయసును 21 ఏళ్లకు కుదించాలి
- భారత్ లో రాజకీయ నాయకులు అత్యంత పెద్ద వయసున్నవారు
- భవిష్యత్తు యువతరానిదే అన్నప్పుడు చట్టసభల్లో వారికి ప్రాధాన్యత పెంచాలి
- రాజ్యసభలో ప్రశ్నించిన ఆమ్ఆద్మీ పార్టీ నేత రాఘవ చద్దా



**విశ్వంభర, ఢిల్లీ:** ప్రజాస్వామ్య దేశాల్లో భారత్ అత్యంత పిన్న వయస్కురాలున్న దేశమని రాజ్యసభ సభ్యులు ఆమ్ఆద్మీ పార్టీ నేత రాఘవ చద్దా అన్నారు. రాజ్యసభలో మాట్లాడిన ఆయన అత్యంత పిన్న వయస్సు కలిగి ఉన్న భారత్‌లో రాజకీయ నాయకులు మాత్రం అత్యంత పెద్ద వయసున్న వారని చెప్పారు. అందుకే ఎన్నికల్లో పోటీచేసేందుకు కావాల్సిన వయస్సు 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు కుదించాలని డిమాండ్ చేశారు. అలా అయితే చట్టసభల్లో యువనాయకత్వం కనిపిస్తుందని అన్నారు. భవిష్యత్తు యువతరానిదే అన్నప్పుడు చట్టసభల్లో వారికి ప్రాధాన్యత పెంచాలని అన్నారు. ఎన్నికల్లో పోటీచేయాలంటే కనీస వయస్సును 25 ఏళ్లు ఉండాలనిరాఘవ్ చద్దా డిమాండ్ చేశారు. మన దేశ జనాభాలో 65శాతం జనాభా 35 ఏళ్ల కంటే తక్కువగా ఉన్నారు, 50శాతం జనాభా 25 ఏళ్ల వయసు కంటే తక్కువగా ఉన్నారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఏర్పాటైన తొలి లోక్‌సభలో 26శాతం మంది సభ్యులు 40 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారుండేవారని గుర్తు చేశారు. అయితే రెండ నెలల క్రితం కొత్తగా ఏర్పాటైన 17వ లోక్‌సభలో 12శాతం మంది సభ్యులు 4 ఏళ్ల కంటే తక్కువ వయసున్నవారున్నారని చెప్పారు. యువ దేశంలో వృద్ధ రాజకీయ నాయకులు ఉన్నారని యువతకు ప్రాధాన్యత ఇచ్చేలా ఎన్నికల్లో పోటీచేసే వయసును 21 ఏళ్లకు కుదించాలని చెప్పారు. యువ రాజకీయ నాయకులతో యువదేశంగా భారత్ ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఇది ప్రభుత్వానికి ఒక సూచన మాత్రమే తాను చేస్తున్నట్లు రాఘవ్ చద్దా చెప్పుకొచ్చారు. రాజకీయాలపై ప్రజల్లో మంచి అభిప్రాయం లేదని చెప్పిన రాఘవ్ చద్దా... తల్లి దండ్రులు వారి పిల్లలను ఒక డాక్టర్‌గానో లేదా ఇంజినీర్‌గానో లేదా క్రీడాకారుడిగానో అవ్వాలని చెబుతున్నారని చెప్పారు. రాజకీయాల్లోకి ఎందుకు పంపడం లేదని రాఘవ్ చద్దా సభలో ప్రశ్నించారు. రాజకీయ నాయకుడు లేదా రాజకీయాల్లో చేరమని ఎవరూ ప్రోత్సహించరని, అయితే రాజకీయాల్లో ఉంటే దేశానికి ఎంత మంచి చేయగలమో అన్న విషయాన్ని తల్లిదండ్రులు పిల్లలకు చెప్పాలని అన్నారు. ఒక నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రజలకు ఉండాల్సిన అర్హత 18 ఏళ్లు అయినప్పుడు ఒకరు చట్టసభల్లో ఎంట్రీ ఇచ్చేందుకు లేదా పోటీచేసేందుకు 21 ఏళ్ల వయసు ఎందుకు ఉండకూడదని ఆయన ప్రశ్నించారు.

# బీజేపీ భారీ మూల్యం చెల్లించక తప్పదు

**ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్**




**ఢిల్లీ:** కులంపై బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తప్పుపట్టారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఇటీవల కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కులం గురించి మాట్లాడటం కలకలం రేపిన విషయం తెలిసిందే. అనురాగ్ ఠాకూర్ జనరల్ క్యాటగిరీకి చెందిన వారని, కులం గురించి మాట్లాడే విషయంలో ఆయన సంయమనంతో వ్యవహరించాలని హితవు పలికారు. కొద్దిరోజుల కిందట బీజేపీ షాపులకు యజమానుల పేర్లు వెల్లడించే నేమ్‌ప్లేట్లు ఉండాలని డిమాండ్ చేసిందని, అప్పుడు కూడా తాము ఈ ప్రతిపాదనపై అభ్యంతరం తెలిపామని సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. భారత్‌లో పేరు కులాన్ని వెల్లడించేలా ఉంటుందని అందుకే తాము ఈ ప్రతిపాదనను వ్యతిరేకించామని చెప్పారు. ఏ ఒక్కరి కులం గురించి అడగడం తప్పని స్పష్టం చేశారు. మీరు అగ్ర కులానికి చెందిన (అనురాగ్ ఠాకూర్) వ్యక్తి కాబట్టి ఇది మీ అహంకారాన్ని సూచిస్తోందని అన్నారు. ఈ అహంకారాన్ని భారత్ సహించదని పేర్కొన్నారు. అనురాగ్ ఠాకూర్, బీజేపీ ఈ అహంకారానికి ఎన్నికల రాజకీయాల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. కాగా తన కులం ఏంటో తెలియని వ్యక్తి కుల గణన గురించి మాట్లాడుతున్నారని రాహుల్ గాంధీని ఉద్దేశించి లోక్‌సభలో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు పెనుదుమారం రేపిన సంగతి తెలిసిందే. కులం గురించి మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని, ఒకరి కులాన్ని గురించి ప్రశ్నించే హక్కు అనురాగ్ ఠాకూర్ సహా ఏ ఒక్కరికీ లేదని, ఇది రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని విపక్ష నేతలు కాషాయ పాలకులపై విరుచుకుపడ్డారు.

# సైకిల్‌పై పోలీసుల పెట్రోలింగ్.. అక్కడ వినూత్న ప్రయోగం!!

**విశ్వంభర, యాదాద్రి:** సహజంగా పోలీస్ పెట్రోలింగ్ ఎలా జరుగుతుందో ప్రతి ఒక్కరికి తెలిసిందే. పోలీసులు ప్రభుత్వం తమకు కేటాయించిన వాహనాల్లో తిరుగుతూ పెట్రోలింగ్ నిర్వహిస్తారు. సమాజంలో నేరాలను నియంత్రించడం కోసం ప్రజలకు రక్షణ కల్పించడం కోసం 24 గంటలు పోలీసులు తమ వాహనాలతో పెట్రోలింగ్ చేస్తారు. ముఖ్యంగా రాత్రి




వేళల్లో జరిగే నేరాలను అరికట్టడం కోసం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుంటారు. పోలీసులు సైకిళ్లపైన పెట్రోలింగ్ అయితే తాజాగా తెలంగాణ పోలీసులు తమకు ప్రభుత్వం కేటాయించిన వాహనాలలో కాకుండా సైకిల్ మీద పెట్రోలింగ్ చేస్తూ అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు . అసలు సైకిల్స్ మీద పెట్రోలింగ్ ఎందుకు చేస్తున్నారు? ఎక్కడ చేస్తున్నారు? అనే వివరాల్లోకి వెళితే రాచకొండ సి పి సుధీర్ బాబు ఆదేశాలతో యాదాద్రి జిల్లాలో పోలీసులు సైకిళ్లపైన పెట్రోలింగ్ మొదలుపెట్టారు. సైకిళ్లపైన వెళుతూ డ్రగ్స్ కట్టడికి అవగాహన జిల్లా వ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు సైకిళ్లపైన వెళుతూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పెట్రోలింగ్లో భాగంగా సైకిల్ మీద వివిధ గ్రామాలకు వెళుతూ అక్కడి యువతకు డ్రగ్స్ మరియు గంజాయి భవిష్యత్తును ఎలా పాడుచేస్తాయో చెబుతూ వాటిపైన అవగాహన కల్పిస్తున్నారు. సైకిల్ మీద పెట్రోలింగ్ చేసినట్లయితే చిన్న చిన్న గల్లీలలో కూడా వెళ్లి పెట్రోలింగ్ చేసే అవకాశం ఉంటుందని నేరాల నియంత్రణకు ఈ వినూత్ననిర్ణయం తీసుకున్నట్టుగా పోలీసులు చెబుతున్నారు. విజిబుల్ పోలిసింగ్ అందుకే అయితే కార్లలో కాకుండా పోలీసులు సైకిల్ మీద రావడం పెట్రోలింగ్ నిర్వహించడం చాలా కొత్తగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సైకిల్ మీద పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న వీడియోలు ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. పబ్లిక్ సేఫ్టీ నేపథ్యంలో ప్రజలతో బలమైన కమ్యూనిటీ బంధాన్ని నిర్మించే క్రమంలో రాచకొండ పోలీసులు విజిబుల్ పోలిసింగ్ వ్యూహంలో భాగంగా ఈ సైకిల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. సైకిల్ పై పెట్రోలింగ్ సత్ఫలితాలను ఇస్తుందా? పెట్రోలింగ్ తో పాటు సైబర్ నేరాల పట్ల, డ్రగ్స్ పట్ల ప్రజలలో అవగాహన పెంచేందుకు ఈ సైకిల్ పెట్రోలింగ్ చేస్తున్నట్టు, సైకిళ్లపై వెళుతూ అక్కడక్కడ ప్రజలతో మాట్లాడుతూ వారికి అవగాహన కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా పోలీసులు సైకిళ్ళ పై చేస్తున్న పెట్రోలింగ్ సత్ఫలితాలను ఇస్తుందని రాచకొండ పోలీసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## పూజా ఖేద్కర్‌కు
# దక్కని ఊరట..

**ముందస్తు బెయిల్ నిరాకరించిన ఢిల్లీ కోర్టు**

**న్యూఢిల్లీ:** వివాదాస్పద ఐఏఎస్ ప్రొబెషనరీ ఆఫీసర్ పూజా ఖేద్కర్‌కు.. ముందస్తు బెయిల్ మంజూరీ చేసేందుకు ఢిల్లీ కోర్టు నిరాకరించింది. యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలో తప్పుడు రీతిలో ఓబీసీ, దివ్యాంగ కోటాను వాడుకున్నట్లు ఖేద్కర్‌పై ఆరోపణలు ఉన్నాయి. యూపీఎస్సీలోని సభ్యులు ఎవరైనా పూజా ఖేద్కర్‌కు సాయం చేశారా అన్న కోణంలో విచారణ చేపట్టాలని అదనపు సెషన్స్ జడ్జి దేవేంద్ర కుమార్ ఆదేశించారు. ఈ కేసులో విచారణ మరింత విస్తృతం చేయాలన్నారు. యూపీఎస్సీ రిక్రూట్మెంట్ సమయంలో ఎవరైనా ఓబీసీ, దివ్యాంగ కోటాను తప్పుడు రీతిలో వాడుకున్నారో లేదో దర్యాప్తు చేయాలని జడ్జి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. పూజా ఖేద్కర్ అభ్యర్థిత్వాన్ని బుధవారం యూపీఎస్సీ రద్దు చేసిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో మరోసారి పరీక్ష రాయకుండా కూడా ఆమెపై నిషేధం విధించారు. పూజా ఖేద్కర్ దాఖలు చేసిన అప్లికేషన్ వాదనలు విన్న జడ్జి బుధవారం తన తీర్పును రిజర్వ్ చేశారు. తనను తక్షణమే అరెస్టు చేస్తారని, అందుకే తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోర్టులో ఆమె పిటీషన్ వేశారు. అయితే యూపీఎస్సీ బోర్డు తరపున వాదించిన ప్రాసిక్యూషన్.. పూజా ఖేద్కర్ దాఖలు చేసిన పిటీషన్‌ను కొట్టివేశారు. మొత్తం వ్యవస్థను చీటింగ్ చేశారని ప్రాసిక్యూషన్ పేర్కొన్నది.

## పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా బంగారం పట్టివేత

**విశ్వంభర, చౌటుప్పల్ :** బంగారం అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు ఎంత పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా, అక్రమార్కులు మాత్రం వివిధ మార్గాల్లో పసిడిని తరలిస్తూ అధికారులకు సవాల్ విసురుతూనే ఉన్నారు. తాజాగా కారు హ్యాండ్ బ్రేక్ వద్ద ప్రత్యేక భాగాన్ని ఏర్పాటు చేసి బంగారం తరలిస్తుండగా, పక్కా సమాచారం మేరకు దాడి చేసి డీఆర్ఐ అధికారులు నిందితులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, చెన్నై నుంచి కర్ణాటకలోని బీదర్ తరలిస్తున్న బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పంతంగి టోల్ ప్లాజా వద్ద స్విఫ్ట్ కారును తనిఖీ చేసిన అధికారులు, కారు హ్యాండ్ బ్రేక్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగంలో 3.57 కిలోల 24 క్యారెట్ల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ రూ. 2.52 కోట్లు ఉంటుందని వెల్లడించారు. నిందితులు విదేశాల నుంచి చెన్నైకి వచ్చి బీదర్‌లో అందించేందుకు వెళ్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



## శ్రీశైలం మల్లికార్జునుని
# దర్శించుకున్న చంద్రబాబు

- ప్రాజెక్టును సందర్శించి కృష్ణమ్మకు జలహారతి
- రాయలసీమకు కరువు లేకుండా చేసే బాధ్యత తమదే
- రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తాం

**విశ్వంభర, శ్రీశైలం :** శ్రీశైలం మల్లికార్జునస్వామిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.అనంతరం చంద్రబాబు శ్రీశైలం ప్రాజెక్టు ను సందర్శించి కృష్ణమ్మకు జల హారతి ఇచ్చారు. అక్కడి నుంచి సున్నిపెంట నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. శ్రీశైలం క్షేత్రాన్ని దివ్యక్షేత్రంగా తయారు చేస్తామని, భారతదేశమే కాకుండా ప్రపంచవ్యాప్తంగాఉండే భక్తులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని అన్నారు. సముద్రంలోకి వృథాగా వెళ్తున్న నీటిని రాయలసీమకు మళ్లించి కరువు లేకుండా ప్రణాళిక చేసే బాధ్యత తమ దేనని అన్నారు. నీళ్లుంటే సంపాద సృష్టించవచ్చని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు మరో రెండు, మూడు రోజుల్లో నిండుతున్నాయని తెలిపారు. అన్ని రిజర్వాయర్లలో నీరు నిలువ ఉంచి నీటిని పొదుపుగా వాడుకుని సంపాద సృష్టించి రాష్ట్రానికి మేలు చేస్తానని అన్నారు. రాయలసీమ అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రావాలని అన్నారు. అందుకు రైతులు ఉద్యాన పంటు, పండ్లతోటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పరిశ్రమల రాక వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు. పండించిన పంట ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లోకి వెళ్లి రైతులు బాగుపడాలంటే ముఖ్యంగా వైసీపీ నాయకులు అడవిపందుల మాదిరిగా రాష్ట్రాన్ని సర్వనాశం చేశారని ఆరోపించారు. రాష్ట్రం కోలుకోవాలంటే మరో 5, 10 సంవత్సరాలు పడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తామన్నారు.



# శ్రీశైలం డ్యామ్‌కు భారీగా వరద..
## పర్యాటకులతో సందడిగా మారిన ఘాట్‌రోడ్లు..!

**విశ్వంభర, శ్రీశైలం :** ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద భారీగా పెరుగుతున్నది. గంట గంటకు వరద ఉధృతి మరింత పెరుగుతూ వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టు పది గేట్లను 15 అడుగుల వరకు ఎత్తి 3,76,670 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. దాంతో వరద నాగార్జున సాగర్ వైపు వెళ్తున్నది. జూరాలా, సుంకేశుల జలాశయాల నుంచి డ్యామ్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీశైలం జలాశయానికి ప్రస్తుతం 3,95,162 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అవుట్ ఫ్లో 4,36,902 క్యూసెక్కులుగా నమోదైంది.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884.40 అడుగులుగా ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలు.. ప్రస్తుతం జలాశయంలో 212.4385 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కుడి, ఎడమగట్టులోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి కొనసాగుతున్నది. మరో వైపు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం పరిసరాలన్నీ పర్యాటకులతో కిక్కిరిసిపోతున్నాయి. డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దాంతో ఘాట్ రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.



## లోక్‌సభ ప్రజాపద్దుల కమిటీలో
# ముగ్గురు ఏపీ ఎంపీలకు చోటు

**విశ్వంభర, అమరావతి :** లోక్‌సభలో ప్రజాపద్దుల కమిటీలో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలకు అవకాశం చోటు దక్కింది. గురువారం జరిగిన ఎన్నికల్లో 18వ లోక్‌సభ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్‌గా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఎన్నుకోగా సభ్యులుగా 19 మంది పోటీ చేశారు. నలుగురు పోటీ నుంచి తప్పుకోవడంతో 15 మంది సభ్యులతో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయైంది. ఈ కమిటీ 2025 ఏప్రిల్ 30 వరకు పనిచేస్తుందని పార్లమెంట్ అధికారులు తెలిపారు.కాగా కమిటీలో మొట్టమొదటిసారిగా ముగ్గురు ఏపీకి చెందిన ఎంపీలకు అవకాశం రావడం ఇదే ప్రథమం. ముగ్గురు కూడా మూడు పార్టీల నుంచి గెలిచిన వారే కావడం కూటమి ఐక్యతను తెలియజేస్తుంది.

టీడీపీకి చెందిన ఒంగో లు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీని వాసులురెడ్డి, జనసేన మచిలిపట్నం పార్లమెం ట్ సభ్యుడు బాలశౌరి, బీజేపీకు చెందిన అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేశ్ బీఏసీలో సభ్యులుగా ఎన్నికయ్యారు.

## మద్యం పాలసీలో తప్పు చేస్తే
# ఎటువంటి శిక్షకైనా రెడీ

### మాజీ మంత్రి నారాయణస్వామి



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో ఎటువంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం ఆయన తిరుపతిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మద్యం పాలసీలో తాను తప్పు చేసినట్లు రుజువు చేస్తే ఎటువంటి శిక్షకైనా సిద్ధమేనని సవాల్ చేశారు.ఏపీలో కొత్త బ్రాండ్‌లన్ని చంద్రబాబే తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చడంలో చంద్రబాబు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి నిధులు ఓర్చుకోలేక పోయారని అన్నారు. పేదవారికి న్యాయం జరిగితే సహించలేక వైసీపీ పాలనపై తప్పుడు ఆరోపణలు చేశారని, అధికారంలోకి రావడానికి అనేక అబద్ధాలు ఆడారని ఆరోపించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కులాల కార్డును ముందుకు తీసుకువచ్చి అధికారం చేపట్టారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే అమ్మ ఒడి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్య అందించాలని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## తిరుమల శ్రీవారి హుండీకి
# రికార్డుస్థాయిలో ఆదాయం

**రూ.125కోట్లు సమకూరినట్లు వెల్లడి**

**విశ్వంభర, తిరుమల :** తిరుమల శ్రీవారి హుండీకి భారీ ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 2022 మార్చి నుంచి శ్రీవారి హుండీ ఆదాయం రూ.100 కోట్ల మార్క్‌ను అందుకుంటోందని ఈ సందర్భంగా టీటీడీ పేర్కొంది. 29 నెలలు వరుసగా రూ. 100 కోట్ల మార్క్‌ను అందుకుంటోంది. ఇక, జులై నెలకు గాను శ్రీవారి హుండీ ఆదాయం రూ.125 కోట్లు సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. శ్రీవారి సన్నిధికి నిత్యం భక్తులు రాకపోకలు సాగుతుంటాయి. ఒక్క ఏపీ నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి కూడా ఇక్కడికి భక్తులు వచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటారు. భక్తులు తమ మొక్కులను కానుకల రూపంలో చెల్లించుకోవడం ఆనవాయితీ. శ్రీవారి హుండీకి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరినట్లు టీటీడీ పేర్కొంది. 2020లో కరోనా మహమ్మారి కారణంగా ఆలయాన్ని మూసివేసారు. ఆ తర్వాత భక్తుల కోసం ఆలయ తలుపులు తెరిచారు. 2022 మార్చి నుంచి తిరుమల స్వామివారి హుండీ ఆదాయం రూ.100 మార్క్‌ను అందుకుంటూనే ఉందని, ఎక్కువశాతం రూ.120 కోట్లను కూడా రాబట్టిందని అధికారులు చెబుతున్నారు. ఇక, జులై నెలకు గాను రికార్డు స్థాయిలో రూ.125కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, రేపు (శుక్రవారం) డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. టీటీడీ ఈవో జే శ్యామల రావు డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నారు.

### ఆలయంలో పవిత్రోత్సవాలు..

తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు మొదలయ్యాయి. సంవత్సరం పొడవునా ఆలయంలో ఎన్నో ఉత్సవాలు, అర్చనలు జరుగుతుంటాయి. తెలియక ఈ కార్యక్రమాల్లో కొన్ని దోషాలు జరుగి ఉండవచ్చు. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రాకుండా ఉండేందుకు ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ఉదయం శ్రీ సీతారామ సమేత లక్ష్మణస్వామివారి విగ్రహాలను విమాన ప్రదక్షిణగా యాగశాలకు చేర్చారు. ఇక, అక్కడ స్నపనతిరుమంజనం ఎంతో వైభవంగా జరిగింది.

ఈ వేడుకలో లు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరినీళ్లతో స్వామి, అమ్మవారి విగ్రహాలకు అభిషేకార్చనలు చేశారు.

## ఈనెల 5,6 తేదీల్లో
# కలెక్టర్లతో చంద్రబాబు భేటీ

**రెవిన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా వెల్లడి**



**విశ్వంభర, అమరావతి :** ఏపీలో కూటమి సర్కార్ అధికారం చేపట్టి రెండు నెలలు కావస్తున్న నేపథ్యంలో పాలనపై పట్టు సాధించేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే కీలకమైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలను పూర్తి చేసిన ఆయన.. ఇప్పుడు వారిని తమ ప్రభుత్వ పాలనకు అనుగుణంగా మార్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఈ నెల 5,6 తేదీల్లో కలెక్టర్లతో పాటు ఎస్పీలతోనూ భేటీ కాబోతున్నారు.ఈ నెల 5,6 తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాక్ లో కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పి సిసోడియా గురువారం వెల్లడించారు. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో సిసిఎల్ఏ జి.జయలక్ష్మితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. మొదటి రోజు కలెక్టర్లతోను, రెండో రోజు కలెక్టర్లు,ఎస్పిలతో కలిసి సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. 5వ తేదీ ఉదయం 10గం.ల నుండి 11గం.ల వరకూ కలెక్టర్ల సమావేశ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రెండు రోజుల్లోనూ ఉదయం 10గం.ల నుండి సా.6గం.ల వరకూ కలెక్టర్ల సమావేశం ఉంటుందని స్పెషల్ సిఎస్ సిసోడియా పేర్కొన్నారు. అంతకంటే ముందు ప్రభుత్వ ప్రాధాన్యాలను కలెక్టర్లకు, ఎస్పీలకు ఆయన వివరించనున్నారు. ప్రతీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ముందుగా చేసే పని ఇదే అయినా ఈసారి మాత్రం కూటమి సర్కార్ ఏర్పాటైన రెండు నెలలకు చంద్రబాబు ఈ భేటీ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో చంద్రబాబు చేసే దిశానిర్దేశం, ఆదేశాలు ఐదేళ్ల పాటు అధికారులకు దిక్సూచిగా పనిచేయనున్నాయి.

# వైభవంగా కోదండరాముని పవిత్రోత్సవాలు

**విశ్వంభర, తిరుపతి :** తిరుపతిలోని కోదండరామస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు గురువారం పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కుంభారాధన, ఉక్తహెూమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు.




### ఆగస్టు 2న డయల్ యువర్ ఈవో...

తిరుమల,తిరుపతిలో భక్తుల సలహాలు, సూచనల కోసం ప్రతి నెల నిర్వహిస్తున్న డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని రేపు(శుక్రవారం) ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనం నుంచి నిర్వహించే కార్యక్రమాన్ని వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందని వివరించారు. భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో జె.శ్యామలరావుకు ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చున్నారు. భక్తులు 0877-2263261 అనే నెంబర్‌కు ఫోన్‌కాల్ చేయవచ్చని సూచించారు.

# ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం

- షూటింగ్‌లో సత్తాచాటిన సర్పంచ్ కొడుకు
- కాంస్యం సాధించిన స్వప్నిల్ కుసాలే
- ధోనీ స్ఫూర్తితో అథ్లెట్ గా మారానన్న యువ షూటర్






**పారిస్:** పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత షూటర్ల హవా కొనసాగుతోంది. భారత అథ్లెట్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారు. షూటింగ్ సంచలనం మను భాకర్ 'డబుల్ మెడల్' ఇచ్చిన స్ఫూర్తితో ఆయా క్రీడాంశాల్లో విజయాలతో సత్తా చాటుతున్నారు. తాజాగా ఈ విశ్వ క్రీడలో భారత్‌కు మరో పతకం వరించింది. యువ షూటర్ స్విప్నిల్ కుశల్.. 50 మీటర్ల మెన్స్ 3 పొజిషన్ షూటింగ్‌లో మూడో స్థానంలో నిలిచారు. దీంతో స్వప్నిల్‌కు కాంస్యం వరించింది. బుధవారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో 590 పాయింట్లు సాధించిన స్వప్నిల్.. ఏడవ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఎక్కువ సంఖ్యలో పది పాయింట్లు కొట్టిన నేపథ్యంలో స్వప్నిల్‌కు ఫైనల్ అర్హత సాధించాడు. ఇక గురువారం ఫైనల్‌లోనూ సత్తాచాటాడు. 451.4 పాయింట్లతో స్వప్నిల్ మూడోస్థానంలో నిలిచాడు. అయితే మోకాళ్లపై కూర్చుని 153.3 పాయింట్లు సాధించిన సమయానికి స్వప్నిల్ ఆరో స్థానంలో ఉన్నాడు. బోర్లా పడుకునే తూటా పేల్చే టైమ్‌కు 310.1 పాయింట్లతో అయిదో స్థానానికి ఎగబాకాడు. అయితే నిలబడి షూట్ చేసే సమయానికి స్వల్ప పాయింట్ల తేడాతో స్వప్నిల్ క్రమంగా ముందుకు సాగాడు. అంతిమంగా పతకం సాధించాడు. కాంస్య పతకాన్ని ముద్దాడాడు. దీంతో ప్రస్తుతం ఒలింపిక్స్‌లో భారత పతకాల సంఖ్య మూడుకు చేరింది. ఇప్పటికే మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మను భాకర్.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మను భాకర్–సరబ్‌జోత్ జోడీ కాంస్య పతకాలు అందించగా.. తాజాగా ఈ జాబితాలో మరో షూటర్ స్వప్నిల్ కుసాలే చేరాడు.

### ధోనీ స్ఫూర్తితో అథ్లెట్‌గా మారా..

మహారాష్ట్రకు చెందిన స్వప్నిల్‌కు ఇదే తొలి ఒలింపిక్ మెడల్. దాంతో అతని పేరు సోషల్ మీడియా వేదికగా మారుమోగుతోంది. స్వప్నిల్ కుసాలే గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు తెగ ఆసక్తిచూపిస్తున్నారు. టీమిండియా దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని స్ఫూర్తిగా తీసుకొనే తాను అథ్లెట్‌గా మారనని ఓ ఇంటర్వ్యూలో స్వప్నిల్ చెప్పుకొచ్చాడు. ధోనీలా తాను కూడా రైల్వే టికెట్ కలెక్టర్‌నని తెలిపాడు. మహారాష్ట్రలోని కోల్హాపూర్ సమీపంలోని కంబాల్వాడి గ్రామానికి చెందిన 29 ఏళ్ల స్వప్నిల్ కుసాలే.. 2012 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొంటున్నాడు. 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అతను ఒలింపిక్ మెడల్ సాధించాడు. ధోనీలానే ప్రశాంతంగా, ఓపికగా ఉండటానికి కుసాలే ఇష్టపడుతాడు.

### ధోనీలోని ఆ గుణాలు ఇష్టం..

ధోనీ క్రికెట్ కెరీర్ ఇతి వృత్తంగా రూపొందించిన ఎంఎస్ ధోనీ సినిమాను తాను ఎన్నోసార్లు చూశానని కూడా స్వప్నిల్ కుసాలే చెప్పుకొచ్చాడు. 'షూటింగ్‌లో ఏ వ్యక్తిని నేను ప్రత్యేకంగా ఫాలో అవ్వను. కానీ క్రికెటర్ ధోనీ అంటే నాకు ఇష్టం. మైదానంలో ఆయన ప్రశాంతంగా, ఓపికగా ఎలా ఉంటాడో.. అది షూటింగ్‌కు అవసరం. నేను కూడా ఆయనలానే రైల్వేలో టికెట్ కలెక్టర్. మా ఇద్దరీ స్టోరీలు ఒకేలా ఉంటాయి.

### సర్పంచ్ కొడుకు..

స్వప్నిల్ కుసాలే తన కుటుంబం నుంచే మొదటి ప్రేరణ పొందాడు. అతని తండ్రి, సోదరుడు జిలాస్థాయి పాఠశాల అధ్యాపకులు కాగా.. అతని తల్లి తమ గ్రామమైన కంబాల్వాడి సర్పంచ్. 2015 ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వప్నిల్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించాడు. 59వ నేషనల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ అతను పతకాలు గెలిచాడు. 2022 ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన స్వప్నిల్.. అరంగేట్ర ఒలింపిక్స్‌లోనే సత్తా చాటి మెడల్ సాధించాడు.

## ఆ ఇద్దరిలో ఒకర్ని ఎంచుకోవడం కష్టం

### రోహిత్ శర్మ



**విశ్వంభర(స్పోర్ట్స్):** టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం విశ్రాంతి తీసుకున్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ.. మళ్లీ బ్యాట్ పట్టేందుకు సిద్ధమయ్యాడు. శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగే తొలి వన్డేతో రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ పునరాగమనం చేయనున్నారు. ఈ మ్యాచ్ నేపథ్యంలో రోహిత్ శర్మ గురువారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా తుది జట్టు ఎంపిక.. నయా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా వికెట్ కీపర్స్ కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లో ఒకరిని ఎంచుకోవడం కష్టమని రోహిత్ తెలిపాడు.

### ఒక్కరే అంటే కష్టం..

'కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌ల్లో ఒకర్ని ఎంచుకోవడం కష్టం. ఎందుకంటే ఇద్దరూ మ్యాచ్ విన్నర్లే. ఆటలో ఎవరికి వారే సాటి. అయితే ఇది సంతోషించదగిన విషయమే. నేను ఇలాంటి సమస్యలనే కోరుకుంటున్నాను. జట్టులో ప్రతిభ కలిగిన ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు దక్కుతాయని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. టీమిండియా ప్రధాన వికెట్ కీపర్‌గా కొనసాగిన రిషభ్ పంత్.. రోడ్డు ప్రమాదంతో జట్టుకు దూరమవ్వడంతో కేఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా కొనసాగాడు. ఐపీఎల్‌తో పంత్ రీఎంట్రీ ఇవ్వడంతో టీ20 ప్రపంచకప్‌కు ఎంపికయ్యాడు. వన్డేల్లో మిడిలార్డర్‌లో ఆడగలిగే సామర్థ్యం ఉన్న కేఎల్ రాహుల్‌కే ప్రధాన వికెట్ కీపర్‌గా టీమిండియా మేనేజ్‌మెంట్ అవకాశాలు ఇచ్చింది. పంత్ అందుబాటులోకి రావడంతో పాటు గంభీర్ సారథ్యంలోని కొత్త మేనేజ్‌మెంట్ ఏ నిర్ణయం తీసుకుంటుందా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇదే విషయాన్ని రోహిత్‌ను అడగ్గా.. అతను క్లారిటీ ఇవ్వలేదు.

## హాకీ గ్రూప్ స్టేజ్.. బెల్జియం చేతిలో ఓడిన ఇండియా



**పారిస్:** పారిస్ ఒలింపిక్స్ హాకీలో డిఫెండింగ్ ఛాంపియన్ బెల్జియం చేతిలో ఇండియా ఓటమి పాలైంది. 2-1 తేడాతో బెల్జియం స్టన్నింగ్ విక్టరీ కొట్టింది. వాస్తవానికి ఆరంభంలో ఇండియానే ఆధిక్యంలో ఉన్నా.. టోక్యో మెడలిస్ట్ బెల్జియం అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించింది. భారత్ తరపున అభిషేక్ ఒక్కడే గోల్ చేశాడు. తొలి రెండు క్వార్టర్లలో భారత్ దూకుడు ప్రదర్శించినా.. కీలకమైన చివరి రెండు క్వార్టర్స్‌లో బెల్జియం ఆటగాళ్లు జోరు పెంచారు. రాజ్ కుమార్ పాల్‌కు ఎల్లో కార్డు ఇవ్వడం వల్ల.. చివరి నిమిషాల్లో ఒక ఆటగాడు లేకుండానే ఇండియా ఆడాల్సి వచ్చింది.

## పారిస్ ఒలింపిక్స్ నుంచి బాక్సర్ నిఖత్ జరీన్ ఔట్



**పారిస్:** బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్.. పారిస్ ఒలింపిక్స్ లో చేతులెత్తేసింది. 50 కేజీల విభాగంలో పోటీపడ్డ నిఖత్ జరీన్.. ఆసియా స్వర్ణ పతక విజేత, చైనాకు చెందిన వూ యూ చేతిలో ఓటమిపాలైంది. ప్రీ క్వార్టర్స్‌లో 5-0 తేడాతో నిఖత్ బాక్సింగ్ బౌట్‌ను కోల్పోయింది. పారిస్ ఒలింపిక్స్‌లో అన్‌సీడెడ్‌గా నిఖత్ పోటీలో దిగింది. తన రేంజ్‌ను అందుకోవడంలో ఆమె ఇబ్బంది పడింది. నిఖత్ పంచ్‌లు వెలవెలబోయాయి. 52 కిలోల ఫ్లయ్‌వెయిట్‌లోనూ ప్రపంచ చాంపియన్ అయిన చైనా క్రీడాకారిణి.. బౌట్ మొత్తం ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మెగా గేమ్స్‌లో మెడల్ సాధిస్తుందని అనుకున్నా.. నిఖత్‌కు రెండో రౌండ్‌లోనే బలమైన ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సి వచ్చింది. తొలి రౌండ్‌లో జర్మనీ బాక్సర్ మాక్సీ కరీనా కోయిజర్‌పై నిఖత్ గెలుపొందింది.

# లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు..

- 82వేల పాయింట్ల మార్క్‌ను దాటిన సెన్సెక్స్
- 25వేల ఎగువన ముగిసిన నిఫ్టీ..



**విశ్వంభర, బిజినెస్:** దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో ముగిశాయి. వరుసగా ఐదో సెషన్‌లో లాభాలను నమోదు చేశాయి. తొలిసారిగా సెన్సెక్స్ 82వేల పాయింట్ల మార్క్‌ను దాటింది. అలాగే, నిఫ్టీ సైతం 25వేల పాయింట్లు దాటి జీవితకాల గరిష్ఠాలకు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో సెన్సెక్స్ 81,949.68 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. మొదట్లో సెన్సెక్స్ ఏకంగా 300 పాయింట్లకుపైగా లాభాల్లోకి వెళ్లింది. ఆ తర్వాత కొద్దిసేపటికే స్వల్పంగా తగ్గాయి. ఇంట్రాడేలో 82,129.49 పాయింట్లకు చేరి ఆల్‌టైమ్ హైకి చేరుకోగా.. కనిష్ఠంగా 81,700.21 పాయింట్లకు తగ్గింది. చివరకు 126.20 పాయింట్ల లాభంతో 81,867.55 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 59.75 పాయింట్లు పెరిగి 25,010.90 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ తొలిసారిగా రికార్డు స్థాయిలో ముగిశాయి. ట్రేడింగ్‌లో దాదాపు 1,237 షేర్లు లాభపడగా.. 2,181 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో కోల్ ఇండియా, పవర్ గ్రిడ్ కార్ప్, శ్రీరామ్ ఫైనాన్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఓఎన్‌జీసీ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ఎంఅండ్ఎం, హీరో మోటోకార్ప్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ నష్టాల్లో ముగిశాయి. సెక్టార్లలో ఆటో, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, మీడియా, టెలికాం, పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ 0.5-2 శాతం క్షీణించాయి. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఎనర్జీరంగాల షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం చొప్పున పతనమయ్యాయి.




## జీఎస్టీ వసూళ్లలో 10.3 శాతం వృద్ధి..!

**విశ్వంభర, బిజినెస్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో జూలై నెల జీఎస్టీ వసూళ్లలో 10.3 శాతం వృద్ధిరేటు నమోదైంది. గత నెలలో రూ.1,82,075 కోట్ల జీఎస్టీ వసూళ్లు జరిగాయి. మరోవైపు రీఫండ్స్ 14.4 శాతం పెరిగి రూ.1,65,793 కోట్లకు చేరా యి. ఏప్రిల్ -జూలై మధ్య కాలంలో జీఎస్టీ వసూ ళ్లు రూ.6.56 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గతేడా దితో పోలిస్తే 11 శాతం వృద్ధి నమోదైంది. ఏప్రిల్ నెలలో గరిష్టంగా రికార్డు స్థాయిలో రూ.2.10 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు జరిగాయి. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలవారీగా జీఎస్టీ వసూళ్ల వివరాల ను అధికారికంగా వెల్లడించడం నిలిపేసింది.

## టాటా మోటార్స్ నికర లాభం 74 శాతం వృద్ధి..!



**విశ్వంభర, బిజినెస్ :** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రికార్డు స్థాయి వృద్ధిరేటు నమోదు చేసుకుంది. 2023-24తో పోలిస్తే 2024-25 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 74శాతం వృద్ధిరేటుతో రూ.5,566 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం గడించింది. మార్కెట్ వర్గాల అంచనాలను టాటా మోటార్స్ త్రైమాసిక ఫలితాలు బ్రేక్ చేశాయి. టాటా మోటార్స్ ఏప్రిల్ త్రైమాసికంలో రూ.1.08 లక్షల కోట్ల ఆదాయం సంపాదించింది. గతేడాదితో పోలిస్తే ఆరు శాతం ఎక్కువ. ఈబీఐటీ ఆదాయం రూ.9100 కోట్లుగా ఉంది. ఈబీఐటీ మార్జిన్ 8.4శాతం పుంజుకుంది. వార్షిక ప్రాతిపదికన 30 బేసిక్ పాయింట్లు పెరిగింది. వాణిజ్య వాహనాల (సీవీ) ఆదాయం గతేడాదితో పోలిస్తే ఐదు శాతం పెరిగి రూ.17,800 కోట్లకు చేరుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వాణిజ్య వాహనాల విభాగం హోల్ సేల్ విక్రయాలు ఆరు శాతం పెరిగి 93,700 యూనిట్లు అమ్ముడయ్యాయి. దేశీయంగా మాత్రం 6.7 శాతం గ్రోత్ నమోదైతే, విదేశాలకు ఎగుమతులు ఫ్లాట్ గా కొనసాగాయి.

# 20 నెలల కనిష్టానికి వృద్ధిరేటు



**న్యూఢిల్లీ:** కీలక రంగాల్లో వృద్ధిరేటు పడిపోయింది. జూన్‌లో 8 ప్రధాన మౌలిక రంగాల్లో ఉత్పాదకత 20 నెలల కనిష్టాన్ని తాకుతూ 4 శాతంగానే నమోదైంది. 2022 అక్టోబర్‌లో 0.7 శాతంగానే ఉన్నది. మళ్లీ ఇప్పుడే ఆ స్థాయిలో క్షీణత చోటుచేసుకున్నట్టు బుధవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. కాగా, అంతకుముందు నెల మేలో 6.4 శాతంగా ఉన్న వృద్ధిరేటు.. నిరుడు జూన్‌లో 8.4 శాతంగా ఉందని అధికారిక వర్గాలు చెప్తున్నాయి. ఈసారి వృద్ధిరేటు ఏడాదిన్నరకుపైగా కనిష్ట స్థాయిని తాకడం వెనుక మందగించిన ముడి చమురు, రిఫైనరీ ఉత్పాదకతే కారణమని స్పష్టమవుతున్నది. ఈ రెండు రంగాల్లో వరుసగా మైనస్ 2.6 శాతం, మైనస్ 1.5 శాతం ఉత్పాదకత నమోదైంది. కాగా, బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాలనే కీలక మౌలిక రంగాలుగా పరిగణిస్తారు. దీంతో ఈ రంగాల తీరుతెన్నులు.. దేశ జీడీపీని ప్రతిబింబిస్తాయి. అలాంటి రంగాల్లో ఇంతటి నిరాశాజనక వృద్ధిరేటు నమోదవడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు. దేశ పారిశ్రామిక ప్రగతికి కొలమానంగా భావించే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లోనూ ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉన్నది. ముడి చమురు, చమురుశుద్ధి రంగాలతోపాటు సహజ వాయువు, ఎరువులు, ఉక్కు సిమెంట్ రంగాల్లోనూ ఉత్పాదకత జూన్‌లో తగ్గుముఖం పట్టింది. గతంతో పోల్చితే ఈ రంగాల్లో వృద్ధిరేటు వరుసగా 3.3 శాతం, 2.4 శాతం, 2.7 శాతం, 1.9 శాతానికి దిగజారింది. అయితే నిరుడు జూన్ కంటే ఈ జూన్‌లో బొగ్గు ఉత్పాదకత 14.8 శాతానికి, విద్యుదుత్పత్తి 7.7 శాతానికి పెరిగినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లను సవరించిన బ్యాంకులు..




**విశ్వంభర, బిజినెస్:** హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్ రూ.3 కోట్ల లోపు డిపాజిట్ల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లను సవరించింది. జులై 24, 2024 నాటికి బ్యాంక్ ఇప్పుడు సాధారణ డిపాజిటర్‌లకు 3% నుంచి 7% వరకు, సీనియర్ సిటిజన్‌లకు 3.5% నుండి 7.5% వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది. ఇది డిపాజిట్ అవధిని బట్టి 7 రోజుల నుంచి 10 సంవత్సరాల వరకు ఉంటుంది. ఈ సవరించిన రేట్లు హెచ్డీఎఫ్సీ బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రతిబింబిస్తాయి. 2 సంవత్సరాల 11 నెలల నుంచి 3 సంవత్సరాల 11 నెలల కాలవ్యవధికి, హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్ 20 బేసిస్ పాయింట్లు పెంచి 7.15% నుంచి 7.35% పరిధికి చేరుకుంది. 4 సంవత్సరాల 7 నెలల నుంచి 4 సంవత్సరాల 7 నెలల పదవీకాలానికి, రేటు 20 బేసిస్ పాయింట్లు పెంచారు. ఐసీఐసీఐ, హెచ్ డీఎఫ్ సీ బ్యాంకులు ఇటీవలే తమ టర్మ్ డిపాజిట్ రేట్లను అప్‌డేట్ చేశాయి. ఇది వారి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రాబడిపై ప్రభావం చూపుతుంది. ఈ కొత్త రేట్లను ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్ అందించే వాటితో పోల్చి చూడవచ్చు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) 7 రోజుల నుంచి 10 సంవత్సరాల వరకు వివిధ కాల వ్యవధిలో సాధారణ కస్టమర్లకు 3.50% నుంచి 7.00% వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లను అందిస్తుంది. సీనియర్ సిటిజన్‌ల కోసం, ఎస్బీఐ అన్ని డిపాజిట్ కాలవ్యవధికి ఈ రేట్లపై అదనంగా 0.50% వడ్డీని అందిస్తుంది. అంటే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సాధారణ కస్టమర్‌లకు అందించే స్టాండర్డ్ రేట్ల కంటే సీనియర్ సిటిజన్‌లు 0.50% ఎక్కువ పొందుతారు. ఐసీఐసీఐ బ్యాంక్ 7 రోజుల నుంచి 10 సంవత్సరాల వరకు వివిధ కాల వ్యవధిలో సాధారణ కస్టమర్‌లకు 3 శాతం నుంచి 7.20 శాతం వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లు అందిస్తుంది. సీనియర్ సిటిజన్‌ల కోసం ఎస్బీఐ అన్ని డిపాజిట్ కాలవ్యవధికి ఈ రేట్లపై అదనంగా 0.50% వడ్డీని అందిస్తుంది. అంటే సీనియర్ సిటిజన్లు 7 రోజుల నుంచి 10 సంవత్సరాలలో మెచ్యూర్ అయ్యే టర్మ్ డిపాజిట్లపై 3.50% నుంచి 7.70% వరకు వడ్డీ పొందుతారు. ఈ రేట్లు జూలై 30 నుంచి అమలులోకి వచ్చాయి. యాక్సిస్ బ్యాంక్ 7 రోజుల నుంచి 10 సంవత్సరాల వరకు వివిధ పదవీకాలాల్లో సాధారణ కస్టమర్‌లకు 3% నుండి 7.20% వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లు అందిస్తుంది. ఈ రేట్లు జూలై 1 నుంచి అమలులోకి వస్తాయి.

విశ్వంభర V3 NEWS

# మరో ఓటీటీ ప్లాట్‌ఫాంలో కాజల్ అగర్వాల్ సత్యభామ



టాలీవుడ్ భామ కాజల్ అగర్వాల్ రీసెంట్‌గా సత్యభామ గా ప్రేక్షకుల ముందుకొచ్చిందని తెలిసిందే. క్రైం థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం జూన్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. షీ షేఫ్ యాప్ అవసరాన్ని తెలియజేసే నేపథ్యంలో సాగే ఈ చిత్రం ఇప్పటికే ఎలాంటి ప్రకటన లేకుండా సైలెంట్‌గా ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. సత్యభామ ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా మేకర్స్ ఆసక్తికర ప్రకటన చేసి కాజల్ అభిమానులను ఖుషీ చేస్తున్నారు. ఈ చిత్రం మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువయ్యేలా కొత్త ఓటీటీ ప్లాట్‌ఫాంలోకి ఎంట్రీ ఇచ్చింది. సత్యభామ ఇప్పుడు ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతున్నట్టు ప్రకటించారు. ఆడియెన్స్ ఇంకేంటి రెండు ప్లాట్‌ఫాంలలో మీకు ఏది అందుబాటులో ఉంటే అందులో చూసేయండి మరి.సుమన్ చిక్కాలా డైరెక్ట్ చేసిన ఈ చిత్రాన్ని ఆరమ్ ఆర్ట్స్ బ్యానర్‌పై బాబీ టిక్కా నిర్మించారు. శ్రీచరణ్ పాకాల మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. ఈ మూవీలో ప్రకాశ్ రాజ్, నాగినీడు, హర్షవర్ధన్, రవి వర్మ, అంకిత్ కొయ్య, సంపద ఎన్, ప్రజ్వల్ ఎద్మ ఇతర కీలక పాత్రలు పోషించారు.

# బిగ్ బాస్ హౌస్‌లోకి విష్ణుప్రియ, రీతూ చౌదరి.?

బుల్లితెర ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తు వస్తున్న రియాల్టీ షో బిగ్ బాస్ సందడి మళ్లీ షురూ కానుంది. ఇప్పటికే ఏడు సీజన్లను సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేసుకున్న ఈ సెలబ్రిటీ గేమ్ షో తర్వాతి సీజన్ ను ప్రారంభించేందుకు స్టార్ మా రెడీ అవుతోంది. సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఈ బిగ్ బాస్ 8 ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే సీజన్ 8 స్టార్ట్ కాకముందే ఈ హౌస్ లోపలికి స్టార్ కాస్ వెళ్ళబోతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరుగుతోంది. అయితే సీజన్ 8 కంటెస్టెంట్స్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సీజన్‌లో యాంకర్ విష్ణుప్రియతో పాటు నటి రీతూ చౌదరి వెళ్లనున్నట్లు తెలుస్తుంది.

దీనికి సంబంధించి ఒక ఇంటర్వ్యూలో విష్ణుప్రియ మాట్లాడుతూ.. నేను ఈ మధ్య చాలా లావు అయ్యాను. కనీసం పది కిలోలయినా తగ్గాలి అనుకుంటున్నాను. బిగ్ బాస్‌కి వెళితే బరువు తగ్గుతానని నమ్మకం ఉంది. అయితే నేను వెళ్తానా లేదా అనేది ప్రేక్షకుల చేతిలో ఉంది. నాకైతే బిగ్ బాస్‌కు వెళ్లడం ఇష్టం లేదు కానీ అభిమానుల వలన వెళ్తాను అని భయం వేస్తుందంటూ విష్ణుప్రియ చెప్పుకోచ్చింది. ఇక రీతు చౌదరి మాట్లాడుతూ.. నేను విష్ణుప్రియలాగనే చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. కానీ నేను హౌస్‌లోకి వెళతానో లేదో చెప్పలేను. సీజన్ 8 డేట్ వచ్చే వరకు వెయిట్ చేయండి అంటూ రీతు చౌదరి తెలిపింది. ఇక వీరితో పాటు అమృత ప్రణయ్, బంచిక్ బబ్లు, యూట్యూబర్ అనిల్, యాదమ్మ రాజు, ఖయ్యూమ్ అలీ, సోనియా సింగ్ బిగ్ బాస్ సీజన్8 కంటెస్టెంట్స్‌గా ఎంపికైట్లు సమాచారం. అంతే కాకుండా మరికొందరి పేర్లు కూడా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అందులో ముఖ్యంగా సెలబ్రిటీల జాతకాలు చెబుతూ ఫేమస్ అయిన వేణు స్వామి, క్రికెటర్ అర్జున్, అబ్బాస్, నటుడు రోహిత్, ఇలా పలువురు పేర్లు చాలా రోజుల నుంచి వినిపిస్తున్నా దీనిపై ఎలాంటి క్లారిటీ లేదు.

# ఆ సినిమాను వదలుకొని ఇప్పటికీ బాధపడుతున్న ప్రభాస్



పాన్ ఇండియా రెబల్ స్టార్, డార్లింగ్ ప్రభాస్ ప్రస్తుతం కల్కి సినిమా విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రూ.1200 కోట్ల కలెక్షన్లకు చేరుకోబోతోంది. దీంతోపాటు జపాన్ లో కూడా విడుదలకు సిద్ధంగా ఉంది. సైన్స్ ఫిక్షన్ కు పురాణాలను ముడిపెట్టి దర్శకుడు చూపించిన విధానానికి సినీ ప్రియులంతా ముగ్ధులయ్యారు. దీంతో తెలుగు రాష్ట్రాలతోపాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తర భారతదేశంలో ఈ సినిమా భారీ వసూళ్లు రాబడుతోంది. హిందీ బెల్టులో ఇప్పటికీ కలెక్షన్లు అలాగే కొనసాగుతుండటంపై విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విదేశాల్లో కూడా రూ.100 కోట్లు సాధించిన సినిమాగా నిలవబోతోంది.

**వంశీకి మరో అవకాశం ఇద్దామని..**

కెరీర్ పరంగా బిజీగా ఉన్న సమయంలో పలువురు దర్శకులు కథలను పట్టుకొని హీరోల దగ్గరకు వస్తుంటారు. కొన్ని నచ్చినప్పటికీ అనివార్య కారణాలవల్ల చేయడానికి వీలుపడదు. కొంతకాలం ఆగమని చెప్పినా దర్శకులు మరో హీరోను చూసుకొని సినిమాను పూర్తిచేస్తారు. అలాగే డార్లింగ్ ప్రభాస్ దగ్గరకు దర్శకుడు వంశీ పైడిపల్లి ఓ కథను తీసుకువెళ్లారు. అది బాగా నచ్చినప్పటికీ బిజీగా ఉండటంతో కుదర్లేదు. ప్రభాస్ మున్నా సినిమాతోనే వంశీ పైడిపల్లి దర్శకుడిగా పరిచయం అయ్యారు. అనుకున్నంత స్థాయిలో ఆడనప్పటికీ మరో అవకాశం ఇద్దామని ప్రభాస్ భావించారు. అయితే అది కూడా కుదర్లేదు.

**బిజీగా ఉండటంవల్ల చేయలేకపోయా...**

దీంతో వంశీ ఆ కథను జూనియర్ ఎన్టీఆర్ కు చెప్పి ఘనవిజయాన్ని అందుకున్నాడు. క్లాస్, మాస్ కలిసిన కథాంశంతో వచ్చిన ఆ సినిమా చేయనందుకు ప్రభాస్ ఇప్పటికీ తన సన్నిహితుల దగ్గర బాధను వ్యక్తం చేస్తుంటాడు. మంచి కథ, మంచి సినిమా అని, బిజీగా ఉండటంవల్ల చేయలేకపోయానని అంటుంటారు. ప్రస్తుతం కల్కి తర్వాత రాజాసాబ్ చేస్తున్నాడు. వచ్చే ఏడాది ఇది విడుదల కాబోతోంది. దీనితర్వాత హను రాఘవపూడితో ఫౌజీ చేయనున్నాడు. ఈ సినిమా తర్వాత సందీప్ రెడ్డి వంగాతో స్పిరిట్ చేస్తాడు. ఈ మూడు సినిమాల తర్వాత సలార్2, కల్కి2 చేయాల్సి ఉంది. ఇలా ఐదు సినిమాలతో ప్రభాస్ మంచి జోరుమీద ఉన్నారు.



# తనకన్నా చిన్నవాడితో డేటింగ్ చేస్తున్న కృతిసనన్?



బాలీవుడ్ నటి, నేషనల్ అవార్డు విన్నర్ కృతిసనన్ గురించి పరిచయం అక్కర్లేదు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో తనకంటూ స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. అయితే ఈ భామ ప్రేమలో పడినట్లు బాలీవుడ్ మీడియా కోడై కూస్తున్న విషయం తెలిసిందే. కృతి తనకన్నా చిన్నవాడు అయిన కబీర్ అనే అబ్బాయితో డేటింగ్‌లో ఉన్నట్లు పలుసార్లు రూమర్స్ వినిపించాయి. అయితే ఈ వార్తలు ఇప్పుడు నిజం అని తెలుస్తుంది. కృతిసనన్ గత నెల జూలై 27న తన బర్త్‌డేను గ్రాండ్‌గా జరుపుకున్న విషయం తెలిసిందే. తన 34వ బర్త్‌డే కోసం గ్రీస్‌లోని ఓ ఐలాండ్‌ను కృతి బుక్ చేసుకున్నారని సమాచారం. ఇక ఈ పుట్టినరోజు వేడుకలకు కృతి చెల్లెలితో పాటు కృతి రూమర్ బాయ్ ఫ్రెండ్ కబీర్ బహియా కూడా పాల్గొన్నాడు. ఇక ఈ ఐలాండ్‌లో కబీర్‌తో కృతి చిల్ అవుతున్న ఫొటోలు, రెస్టారెంట్‌లో కలిసి భోజనం చేస్తున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఏడాది వచ్చిన తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా, క్రూ సినిమాలతో మంచి హిట్లను అందుకుంది కృతి సనన్. ప్రస్తుతం దో పట్టి అనే సినిమాలో నటిస్తుంది ఈ భామ. కబీర్ బాహియా విషయానికి వస్తే.. యుకేకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొడుకు అని సమాచారం. అంతేకాకుండా అతడి లింక్‌డ్ ఇన్‌లో ఉన్న బయో ప్రకారం వరల్డ్‌వైడ్ ఏవియేషన్ అండ్ టూరిజంలో మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. మరోవైపు అతడికి భారత్ క్రికెటర్లు ధోని, పాండ్యాతో పాటు చాలా మంది పరిచయం ఉన్నట్లు తెలుస్తుంది.

## రాజ్ కుమార్ సంతోషితో సినిమా చేయబోతున్న అమీర్‌ఖాన్!

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ప్రయోగాలు చేసే స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు అమీర్‌ఖాన్. పీకే, దంగల్ సినిమాలతో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ సీక్రెట్ సూపర్ స్టార్ కాంపౌండ్ నుంచి మళ్లీ ఆ స్థాయి సినిమా రాలేదని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అమీర్ ఖాన్ లీడ్ రోల్‌లో నటించిన లాల్ సింగ్ చడ్డా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. చివరగా సలామ్ వెంకీ చిత్రంలో అతిథి పాత్రలో మెరిశాడు. ఇంతకీ మళ్లీ కొత్త సినిమాఎప్పుడని చర్చించుకుంటుండగా ఆసక్తికర వార్త బీటౌన్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం తన కుమారుడి సినిమాల కోసం ముంబైలో స్క్రిప్టులు వినే పనిలో బిజీగా ఉన్నాడట. అమీర్‌ఖాన్ సీనియర్ డైరెక్టర్ రాజ్ కుమార్ సంతోషితో సినిమా చేయబోతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది. సోషల్ డ్రామా నేపథ్యంలో రానున్న ఈ చిత్రాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటించబోతున్నాడట.90స్‌లో అమీర్‌ఖాన్-రాజ్‌కుమార్ సంతోషి కాంబోలో అందాజ్ అప్నా అప్నా సినిమా వచ్చింది. చాలా సంవత్సరాల ఈ ఇద్దరి కాంబోలో వస్తున్న తాజా ప్రాజెక్టులో అమీర్ ఖాన్ తన వయస్సుకు తగ్గ పాత్రలో కనిపించబోతున్నాడట. ఇదే నిజమైతే అమీర్‌ఖాన్ ఎలాంటి కథలో కనిపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. ఈ వార్తలతో ఎంతోమంది కొత్త దర్శకులున్నప్పటికీ మంచి హిట్ అందుకోవాలంటే పాత డైరెక్టర్ అయితేనే పక్కా అని అమీర్ ఖాన్ గట్టిగానే ఫిక్సయ్యాడని నెట్టింట చర్చ నడుస్తోంది.

# మీ వ్యక్తిగత సమాచారం భద్రమేనా?

**సేఫ్టీకోసం విలువైన టిప్స్ మీకోమే...**

**విశ్వంభర (సాంకేతికం):** ఇది ఇంటర్నెట్ యుగం. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి నిద్రపోయే వరకు మనం చాలా పనుల కోసం ఇంటర్నెట్‌పై ఆధారపడుతుంటాం. ప్రత్యేకించి సోషల్ మీడియా యాప్స్ ద్వారా మనం నిత్యం ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయి ఉంటున్నాం. మన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కీలక వివరాలు, ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లను సోషల్ మీడియా యాప్స్ ద్వారా ఇంటర్నెట్ ప్రపంచంలోకి అప్‌లోడ్ చేస్తున్నాం. అయితే ఆ సమాచారం సేఫేనా? అది దుర్వినియోగం అయ్యే ముప్పు ఉంటుందా? అనే ప్రశ్నలు ఉదయిస్తుంటాయి. ఈ ప్రశ్నలు తలెత్తే అవకాశం ఇవ్వకుండా, డిజిటల్ ప్రపంచంలోకి వెళ్లిన మన వ్యక్తిగత సమాచారానికి సేఫ్టీని అందించే విలువైన టిప్స్‌ను ఇప్పుడు తెలుసుకుందాం.

**స్ట్రాంగ్ పాస్‌వర్డ్స్..**

మీరు వినియోగించే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌కు సం బంధించిన పాస్‌వర్డ్స్..స్ట్రాంగ్‌గా ఉండేలా చూసుకోండి. మీ పుట్టిన తేదీ, 1234 లాంటి అత్యంత సాధారణ పాస్ వర్డ్స్ వాడకూడదు. ఎందుకంటే వాటిని హ్యాకర్లు చాలా ఈజీగా హ్యాక్ చేస్తారు. పాస్ వర్డ్ కనీసం 12 అక్షరాలలో ఉండేలా చూడండి. వాటిలో సంఖ్యలు, అక్షరాలు, చిహ్నాలు మిక్స్‌డ్‌గా ఉంటే చాలా సేఫ్. మీ వ్యక్తిగత సమాచారంలోని పేరు, ఊరుతో ముడిపడిన పదాలు పాస్ వర్డ్‌లో ఉండకూడదని గుర్తుంచుకోండి.

**అనుమానాస్పద లింక్స్‌పై క్లిక్ చేయొద్దు..**

వెబ్ బ్రౌజింగ్ చేసే క్రమంలో ఏవేవో పాప్-అప్స్ వస్తుంటాయి. వాటిలో ఏది పడితే దాన్ని క్లిక్ చేయకూడదు. మన పేరుతో ఏదైనా అపరిచిత మెయిల్ ఐడీ నుంచి మెయిల్ వచ్చినా దాన్ని తెరవకూడదు. అయితే ఇలాంటి మెయిల్స్‌ను చూసి ఆతురతలో చాలా మంది ఓపెన్ చేసి చూస్తున్నారని ఒక అధ్యయనంలో తేలింది. అలాంటి అపరిచిత మెయిల్స్‌ను ఓపెన్ చేస్తే, మన ఫోన్ లేదా కంప్యూటర్‌లోకి స్పైవేర్ డౌన్‌లోడ్ అయ్యే ముప్పు ఉంటుంది. ఇలాంటి స్పైవేర్‌లు అనుకోకుండా డౌన్‌లోడ్ అయినా ఇబ్బంది కలగకూడదంటే, నాణ్యమైన యాంటీ సాఫ్ట్‌వేర్‌ను మనం సిద్ధంగా ఉంచుకోవాలి.

**వ్యక్తిగత వివరాలు షేర్ చేయొద్దు..**

మన పర్యటనల వివరాలను, వ్యక్తిగత జీవితంతో ముడిపడిన ఫొటోలు/వీడియోలను సోషల్ మీడియాలో పెట్టకపోవడమే బెటర్. ఒకవేళ వాటిని పోస్ట్ చేసినా, ప్రైవసీ సెట్టింగ్స్ సరిగ్గా చేసుకోవాలి. లేదంటే ఆ సమాచారం తప్పుడు వ్యక్తుల చేతికి చిక్కి దుర్వినియోగం అయ్యే రిస్క్ ఉంటుంది. నెటిజన్లలో దాదాపు 30 శాతం మందికి సోషల్ మీడియాలో తాము పంచుకునే సమాచారం దుర్వినియోగం అవుతుందనే విషయం కూడా తెలియదని ఒక సర్వేలో వెల్లడైంది. 12 శాతం మందికి ప్రైవసీ సెట్టింగ్స్ ఎలా చేసుకోవాలనేది తెలియదని ఆ సర్వేలో గుర్తించారు.

**ఉచిత వైఫైతో జాగ్రత్త..**

ఉచిత వైఫైయే కదా అని దాన్ని వాడేయొద్దు. ఒకవేళ దాన్ని వాడినా, ఆ సమయంలో బ్యాంకింగ్ లావాదేవీలు అస్సలు చేయొద్దు. ఎందుకంటే, ఉచిత వైఫైని అందిస్తున్న వారు మీ బ్యాంకింగ్ లావాదేవీల సమాచారాన్ని ట్రాక్ చేసే ముప్పు ఉంటుంది. ఇంటి బయటికి వెళ్తున్నప్పుడు ఫోన్‌లో ఆటోమేటిక్ వైఫై కనెక్షన్ ఆప్షన్‌ను ఆఫ్ చేసుకోవాలి. వీపీఎన్ సర్వీసులను ఉపయోగించుకోవాలి. ఇంటి బయట ఉన్నప్పుడు కీలకమైన ఆర్థిక లావాదేవీలు చేయకూడదు.

**యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్..**

యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ కొనడాన్ని కొందరు అనవసర భారంగా భావిస్తుంటారు. వాస్తవానికి అది అత్యవసరం. ఇది కంప్యూటర్ భద్రతను పెంచుతుంది. బ్రిటన్‌లోని దాదాపు 25 శాతం కంప్యూటర్లు తరుచుగా వైరస్ ఎటాక్ బారినపడుతుంటాయి. అంటే కంప్యూటర్ల భద్రతకు ఎంతటి ముప్పు ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి ఎదురుకావద్దంటే యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ వాడాలి.

**లింక్ చెక్ చేయండి..**

ఎవరైనా మీకు ఏదైనా యూఆర్ఎల్ లింక్ పంపిస్తే, దానిని నిశితంగా పరిశీలించాలి. అది సేఫ్‌గా ఉందా, లేదా అనేది తనిఖీ చేయాలి. ఎందుకంటే, కొన్ని ఫిషింగ్ లింక్స్‌ను మీరు క్లిక్ చేస్తే, మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లోని వ్యక్తిగత సమాచారం బదిలీ అయిపోతుంది. మీ సిస్టమ్‌లోకి మాల్వేర్ డౌన్‌లోడ్ అయిపోతుంది.

**లాగౌట్ చేయండి..**

ఆన్‌లైన్ బ్యాంకింగ్ పూర్తయ్యాక, ఈమెయిల్ పంపడం పూర్తయ్యాక, తప్పకుండా లాగౌట్ అవ్వాలి. బ్రౌజర్‌ను మూసివేయాలి. ప్రత్యేకించి పబ్లిక్ వైఫైని వాడేటప్పుడు ఈ జాగ్రత్త తప్పనిసరి. ప్రతినెలలో కనీసం ఒకసారైనా మీ ఆన్‌లైన్ అకౌంట్లు, సోషల్ మీడియా ఖాతాలను లాగౌట్ చేయాలి. తద్వారా మీ డిజిటల్ సేఫ్టీ మరింత పెరుగుతుంది.

**క్యాచేను క్లియర్ చేయండి..**

మీ ఇంటర్నెట్ స్పీడ్ పెరగాలన్నా, వెబ్ బ్రౌజింగ్‌లో సమస్యలు రావొద్దన్నా, క్యాచేను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలి. ఇది మీ ఇంటర్నెట్ బ్రౌజింగ్ ప్రపంచాన్ని శుభ్రంగా, సాఫీగా ఉంచుతుంది. మనం అప్పటివరకు ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసిన వెబ్‌సైట్ల సమాచారం క్యాచేలో ఉంటుంది. క్యాచేను డిలీట్ చేస్తే ఆ సమాచారమంతా చెరిగిపోతుంది. దీనివల్ల మీ ప్రైవసీ మరింత బలపడుతుంది. మీ ఆన్‌లైన్ యాక్టివిటీని ఇతరులు అంచనా వేయడం కుదరదు. ఫోన్‌లో, కంప్యూటర్‌లో ఎందులోనైనా మనం సెట్టింగ్స్‌లోకి వెళ్లి క్యాచేను తొలగించవచ్చు. అయితే ఇలా క్యాచే క్లియర్ చేసేటప్పుడు ఏయే ఫొటోలు, ఫైల్స్ తొలగించాలో, ఏవి తొలగించకూడదో మీరే ఎంపిక చేసుకోవచ్చు.

**మల్టీ ఫ్యాక్టర్ ఆథెంటికేషన్..**

హ్యాకర్లు మీ ఆన్‌లైన్ అకౌంట్ల పాస్‌వర్డ్‌లను క్రాక్ చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంటారు. అందుకే ఒకటికి మించిన స్టెప్స్‌తో కూడిన సెక్యూరిటీని మన ఆన్‌లైన్ లేదా సోషల్ మీడియా అకౌంటుకు యాడ్ చేసుకోవాలి. ఈక్రమంలో పాస్ వర్డ్‌కు అదనంగా ఓటీపీ, పిన్, ఫింగర్ ప్రింట్ వంటి సెక్యూరిటీ ఫీచర్లను జోడించుకోవచ్చు. దీనివల్ల మీ సమాచారాన్ని హ్యాకర్లు దొంగిలించడం చాలా కష్టమవుతుంది.

**పాస్‌కోడ్‌లను ఉపయోగించండి..**

మీ స్మార్ట్‌ఫోన్‌లో ప్రత్యేకమైన పాస్ కోడ్‌ను తయారు చేసుకోండి. అది ఎంటర్ చేస్తేనే ఆన్‌లైన్, సోషల్ మీడియా అకౌంట్లు ఓపెన్ అయ్యేలా చేయండి. దీని వల్ల మీ డివైజ్ హ్యాక్ అయ్యే రిస్క్ తగ్గిపోతుంది. ఫేస్ ఐడీ, ఫింగర్ ప్రింట్ ఆప్షన్లు కూడా ఎంతో సేఫ్టీని అందిస్తాయి. హ్యాకర్లు ఈజీగా అంచనా వేయగలిగే పిన్ నంబర్లను వాడటం మానేయండి. పిన్ నంబర్లలో పేర్లు, తేదీలు ఉండకుండా జాగ్రత్త పడండి.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం విశ్వంభర తెలుగు దినపత్రిక అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com